Follow: @ANNTELUGU
11-06-2026
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 162 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## భారత్‌లో పెను మార్పులను ప్రపంచం చూస్తోంది

- 25 కోట్లమందిని పేదరికం నుండి బయటకు తెచ్చాం
- ఉగ్రవాదం అణచివేశాం.. నక్సలిజం నిర్మూలించాం
- ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు

02


టాప్ న్యూస్



## మూల్యం చెల్లించుకోక తప్పదు

ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్
ఒప్పందంలో ఆలస్యం చేశారన్న ట్రంప్

03



## టీడీపీకి లోక్ సభ డిప్యూటీ స్పీకర్?

చంద్రబాబుదే తుది నిర్ణయం

03



## సుప్రీంకోర్టుకు కాంగ్రెస్

మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై పోరు

03




## పీవోకేలో హెలికాప్టర్ క్రాష్

### 21మంది పాక్ ఆర్మీ మృతి.

**ఇస్లామాబాద్, మహా :** పాక్ ఆక్రమిత కశ్మీర్ పరిధిలో బుధవారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. పాకిస్థాన్ సైన్యానికి చెందిన రష్యన్ నిర్మిత 'ఎంఐ17' రవాణా హెలికాప్టర్ సాంకేతిక లోపంతో కుప్పకూలిపోయింది. ఈ భయానక దుర్ఘటనలో హెలికాప్టర్ లోపల ఉన్న రక్షణ సిబ్బంది అంతా అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. పీవోకే ప్రాంతీయ రాజధాని ముజఫరాబాద్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పాకిస్థాన్ మిలిటరీ అధికారిక మీడియా విభాగమైన ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్పీఆర్) ధ్రువీకరించింది. ప్రమాద తీవ్రత దృష్ట్యా హెలికాప్టర్ లో ఉన్నవారిలో ఒక్కరు కూడా ప్రాణాలతో బయటపడలేదని, విధి నిర్వహణలో ఉన్న సైనికులంతా వీరమరణం పొందారని సైన్యం పేర్కొంది. దాదాపు 21 మంది భద్రతా సిబ్బంది ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయి ఉంటారని అంతర్జాతీయ వార్తా సంస్థలు నివేదించాయి.

# కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం?



### సోనియాతో మమతాబెనర్జీ సుదీర్ఘచర్చలు

- టెన్ జన్ పథ్ లో రెండురోజులుగా వరుస భేటీలు
- రాహుల్ తో అభిషేక్ బెనర్జీ మంతనాలు
- మమతకు జాతీయ ఉపాధ్యక్షపదవి..
- ఎంపీలు చేజారకుండా కొత్త వ్యూహం
- జాతీయ రాజకీయాల్లో చర్చోపచర్చలు



**ఢిల్లీ, మహా :** జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయా? ఒక్క ఓటమితో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ తిరిగి సొంతగూటికి రావడమే బెటర్ అని అనుకుంటున్నారా? మోదీ అమిత్ షా ద్వయాన్ని తట్టుకోవాలంటే వ్యూహం మార్చాలని డిసైడ్ అయ్యారా? జాతీయ రాజకీయవర్గాల్లో టీఎంసీ కాంగ్రెస్ పార్టీలో విలీనం కావడం ఖాయమన్న చర్చలు జరుగుతున్నాయి. గత రెండురోజులుగా సోనియా నివాసం టెన్ జన్ పథ్ లో మమతాబెనర్జీ గంటల కొద్దీ సమయం వెచ్చిస్తున్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో మమత భేటీ అయిన మరుసటి రోజే, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. బుధవారం ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో దాదాపు 90 నిమిషాల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీ, కాంగ్రెస్‌లో తృణమూల్ విలీనం కానుందనే ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ మిగతా 2వ పేజీలో

## అమరావతికి గుడ్ న్యూస్

సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు కేంద్రకేబినెట్ ఆమోదం

- ఐదు ఎకరాల్లో.. ఆఫీస్ కాంప్లెక్స్
- రూ.2,500 కోట్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్
- 1,800 కార్ల పార్కింగ్ సదుపాయం ఏర్పాటు
- 1,568 నివాస క్వార్టర్ల నిర్మాణం ప్రారంభం



02

## తెలంగాణలో నో 'ఫ్రెండ్లీ పోలీసింగ్'

నేరస్తులపై ఉక్కుపాదం

గ్రేహౌండ్స్ విభాగం రద్దు..
కొత్త విభాగాల ఏర్పాటు.
సైబర్‌క్రైమ్, డ్రగ్స్ నివారణే ప్రధాన లక్ష్యం.
డీజీపీ సీవీ ఆనంద్



02



## మాట నిలబెట్టుకున్న మంత్రి జూపల్లి

- మినీ స్టేడియానికి తన 4 ఎకరాల భూమి విరాళం
- రూ.1.50 కోట్ల విలువైన సొంత స్థలం కేటాయింపు
- తహసీల్దార్ కార్యాలయంలో డిజిటల్ సంతకం చేసిన మంత్రి
- భూమి బదిలీ ప్రక్రియ పూర్తి

02



## హైదరాబాద్‌కు మకుటాయమానంగా ఫ్యూచర్ సిటీ

### ఎఫ్‌సీడీఏ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణ ఆదాయంలో 60 శాతం భాగస్వామ్యం భాగ్యనగరానిదే.
- బీఆర్ఎస్ రద్దయిన వెయ్యి రూపాయల నోటు లాంటిది
- భవిష్యత్ నగరాన్ని రద్దుచేస్తామంటే.. బండకేసి కొడతారు
- నీ తాత జాగీరని బతుకమ్మకుంట రాసిచ్చావా?

03

## సోనియా, రాహుల్ తో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

02



## రాష్ట్ర ప్రభుత్వం ఏమిస్తోంది?

- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల స్పందన దారుణం
- వైఎస్ జగన్ ఫైర్

02





# మాట నిలబెట్టుకున్న మంత్రి జూపల్లి

**కొల్లాపూర్, మహా :** రాజకీయాల్లో ఎప్పుడూ ఆదర్శంగా ఉంటూ ప్రజా సంక్షేమాన్ని, నిజాయితీని, విలువలను తమ సిద్ధాంతాలుగా మార్చుకున్న పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిస్వార్థ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తాను స్థానిక క్రీడాకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సుమారు రూ.1.50 కోట్ల విలువైన తన 4 ఎకరాల సొంత భూమిని మినీ స్టేడియం నిర్మాణానికి విరాళంగా అందజేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వీపనగండ్ల మండల కేంద్రంలో ఉన్న తన సొంత భూమిని క్రీడా మైదానానికి బదలాయిస్తూ బుధవారం కోడేరు మండల తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేశారు. గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు వచ్చిన సందర్భంలో, స్థానిక యువత, క్రీడాకారుల అభ్యర్థన మేరకు మినీ స్టేడియం ఏర్పాటు కోసం తన సొంత భూమిని ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 532/ఆ పరిధిలో తన పేరు మీద ఉన్న 4 ఎకరాల పట్టా భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. కోడేరు తహసీల్దార్ కార్యాలయంలో వీపనగండ్ల ఎంఆర్ఓ డిజిటల్ లాగిన్ ద్వారా ఈ భూమిని మినీ స్టేడియానికి కేటాయిస్తూ అధికారిక ప్రక్రియను పూర్తి చేశారు. ఈ చారిత్రాత్మక భూ బదలాయింపు ప్రక్రియకు సాక్షులుగా వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మునిగొండ గోపి, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు. కోట్లలో విలువ చేసే భూమిని క్రీడల అభ్యున్నతి కోసం, నిరుపేద గ్రామీణ యువత భవిష్యత్తు కోసం దానం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావును మంచి మనసున్న నాయకుడని పలువురు ప్రశంసించారు. మంత్రికి ప్రజలు, క్రీడాకారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# సోనియా, రాహుల్ తో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

**ఢిల్లీ, మహా :** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్.. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలతో బుధవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఢిల్లీలోని సోనియా గాంధీ నివాసమైన 10 జన్ పథ్ లో ఈ సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నుంచి తమిళనాడు రాష్ట్రానికి రావాల్సిన నిధుల బకాయిల సాధన, నీట్ వైద్య ప్రవేశ పరీక్ష నుంచి రాష్ట్రానికి మినహాయింపు తీసుకురావాల్సిన ఆవశ్యకత తదితర అంశాలను విజయ్ వారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అలాగే సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలగకుండా రాష్ట్రాల హక్కులను కాపాడుకునే దిశగా విపక్షాలు అనుసరించాల్సిన ఉమ్మడి కార్యాచరణపై కూడా విజయ్, రాహుల్ గాంధీల మధ్య ఏకాభిప్రాయం వ్యక్తమైనట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. జాతీయ స్థాయిలో బలమైన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి, ఇప్పుడు దక్షిణాదిన అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా ఎదిగిన విజయ్ మద్దతు భవిష్యత్తులో అత్యంత కీలకం కానుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఏమిస్తోంది?

**కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల స్పందన దారుణం**
**వైఎస్ జగన్ ఫైర్**

**విశాఖ, మహా :** స్టీల్ ప్లాంట్ ప్రమాదం బాధకరం అని..ప్రమాదానికి ఉద్యోగులు కారణం కాదని, లిక్విడ్ మెటల్ బ్లాస్ట్ అవ్వడంతోనే జరిగిందని, కానీ, కేంద్ర, రాష్ట్రాలు స్పందిస్తున్న తీరు దారుణంగా ఉందని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్ విమర్శించారు. బుధవారం సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 14 నెలల కిందట ఇదే తరహాలో ప్లాంట్ లో ప్రమాదం జరిగి పెంటయ్య అనే కార్మికుడు మరణిస్తే..చంద్రబాబు ప్రభుత్వం నెలలోపే ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చారని, ఇప్పటి వరకు పరిహారం కూడా ఇవ్వలేదని జగన్ విమర్శించారు. అధికారుల్ని అడిగితే ఫైల్ పోయిందని అంటున్నారని, కూటమి ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో 9 మంది చనిపోగా, గాయపడ్డ ఐదుగురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, 95 శాతం కాలిన గాయాలతో ఒకరు చికిత్స పొందుతున్నారు అని జగన్ తెలిపారు. కేంద్రం ఇచ్చిన రూ.2లక్షల పరిహారం మినహా చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా ఎక్స్‌ట్రా రాలేదని, పరిహారం విషయంలో చంద్రబాబు కొడుకు మంత్రి లోకేశ్ దారుణంగా మాట్లాడాడని విమర్శించారు. ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు మొత్తం రూ.1.72 కోట్లు వస్తాయని లోకేశ్ చెప్పాడని, నిజానికి స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు కేంద్రం నుంచి అదంతా హక్కుగా రావాల్సిందే వస్తుందన్నారు. అందులో 'బోడి' మీరిచ్చేది ఏమిటి? మరి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏం ఇస్తున్నట్లు? ఆ రూ.1.72 కోట్లు అది వారి హక్కు. ఇంకా ఉద్యోగులకు రావాల్సిన గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, రిస్క్ ఇన్సూరెన్స్.. అన్నీ కలిపి రూ.1.45 కోట్లు వస్తాయి. మరోవైపు సంస్థ తన వంతుగా రూ.25 లక్షలు ఇస్తుంది. ఇంకా ప్రధాని సహాయనిధి నుంచి రూ.2 లక్షల చొప్పున వస్తుంది. మరి 'బోడి' రాష్ట్ర ప్రభుత్వం ఏమిస్తోంది. మీకు మీరుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. వాళ్లకు హక్కుగా వచ్చేది వస్తోంది తప్ప, రాష్ట్ర ప్రభుత్వంగా మీరు ఇస్తున్నది ఏమీ లేదు అని జగన్ విమర్శించారు. గతంలో.. వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ తరహాలోనే ఫ్యాక్టరీ ప్రమాదం జరిగినప్పుడు స్పాట్ లో రూ.కోటి రూపాయల పరిహారం అందించాం. బాధిత కుటుంబాలకు తక్షణమే ఆదుకున్నాం అని, మరికొన్ని నెలలు ఆగితే మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని, వచ్చిన నెల రోజుల్లోనే రూ.1 కోటి పరిహారం ఇచ్చి ఆదుకుంటాం అని జగన్ ప్రకటించారు.



# కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం?

( మొదటి పేజీ తరువాయి )

అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో బీజేపీ 208 స్థానాలతో అధికారాన్ని దక్కించుకోగా, టీఎంసీ కేవలం 80 సీట్లకే పరిమితమైంది. ఈ ఓటమి అనంతరం పార్టీలో తీవ్ర అసమ్మతి చోటుచేసుకుంది. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని వీడుతుండటంతో టీఎంసీ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో టీఎంసీ నేతల వరుస భేటీలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. జాతీయ మీడియాలో వస్తున్న కథనాల ప్రకారం, ఈ సమావేశాల్లో ప్రధానంగా బెంగాల్‌లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, 'ఇండియా' కూటమిని పటిష్టం చేసే వ్యూహాలపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. కూటమిలో



రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అంగీకరించేందుకు టీఎంసీ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే, విలీన ప్రతిపాదన తృణమూల్ కాంగ్రెస్ నుంచే రావాలని, తమ వైపు నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

**విలీనం కొట్టిపారేస్తున్నా**

మరోవైపు, విలీనం వార్తలను తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు తీవ్రంగా ఖండించాయి. ఇవన్నీ కేవలం నిరాధారమైన పుకార్లేనని కొట్టిపారేశాయి. రాహుల్‌అభిషేక్ భేటీలో విలీనం ప్రస్తావనే రాలేదని, కేవలం బెంగాల్ రాజకీయాలు, కూటమి భవిష్యత్తు వ్యూహాలపైనే చర్చించారని పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా, మమతా బెనర్జీ గతంలో కాంగ్రెస్‌తో విభేదించి 1998లో తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించిన విషయం తెలిసిందే. ఇప్పటికే మెజారిటీ ఎమ్మెల్యేలు ప్రత్యేకవర్గంగా మారగా, మెజారిటీ ఎంపీలు 20మంది బిజెపి గూటికి లేదా ప్రత్యేకవర్గంగా మారేందుకు రోడ్ మ్యాప్ రెడీ చేసుకున్నట్లు తెలుస్తోంది.

# దేశ సమగ్రతకు విభజనవాదం గొడ్డలిపెట్టు.

**'జనసేన అధినేత పవన్ కళ్యాణ్**

**ఢిల్లీ, మహా:** ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులు దేశ సమగ్రతకు, ఐక్యతకు అత్యంత ప్రమాదకరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. ఇటువంటి విభజనవాద ధోరణులు దేశ శ్రేయస్సుకు ఏమాత్రం మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే) సమావేశాల నిమిత్తం దేశ రాజధాని న్యూదిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, ప్రముఖ వార్తాసంస్థ 'ఏఎన్ఐ' ఎడిటర్ స్మితా ప్రకాశ్‌తో నిర్వహించిన ప్రత్యేక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. సుమారు 84 నిమిషాల పాటు సాగిన ఈ సుదీర్ఘ సంభాషణలో పవన్ కళ్యాణ్ జాతీయ రాజకీయాలు, పరిపాలన, ప్రాంతీయ వైషమ్యాలు, ఏపీ అభివృద్ధి, తెలంగాణ విభజన తదితర అనేక కీలకమైనా, సున్నితమైన అంశాలపై తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవుల్లో కొనసాగుతున్న నాయకులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలే తప్ప, ఒక ప్రాంతాన్ని మరో ప్రాంతంతో పోల్చుతూ ప్రజల మధ్య విద్వేష పూరిత వాతావరణాన్ని సృష్టించడం సరికాదని పవన్ కళ్యాణ్ హితవు పలికారు. భారతదేశ చరిత్రను ఉటంకిస్తూ.. గతంలో 570కి పైగా సంస్థానాలను విలీనం చేసి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహానుభావులు దేశాన్ని పటిష్టం చేశారని, అటువంటి అఖండ భారతదేశంలో మళ్లీ విభజన రేఖలు గీయాలని చూడటం దేశ ఐక్యతకు గొడ్డలిపెట్టు వంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కొందరు నాయకులు తనను హైదరాబాద్ రావద్దంటూ మాట్లాడిన తీరును ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదే తర్కాన్ని గనుక మనం పాటిస్తే, కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ వంటి వారు కూడా కొన్ని ప్రాంతాల్లో పర్యటించవద్దని చెప్పాల్సి ఉంటుందని, ఇటువంటి సంకుచిత మరియు కుంచిత రాజకీయాలు దేశ ప్రగతికి ఎంతమాత్రం తగవని ఆయన గట్టిగా విమర్శించారు. ఈ దేశంలో జన్మించిన ప్రతి పౌరుడికి దేశంలో ఎక్కడికైనా వెళ్లే, నివసించే పూర్తి స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అలాగే తెలుగు రాష్ట్రాల విభజనపై వస్తున్న విమర్శలపై కూడా పవన్ కళ్యాణ్ ఈ ఇంటర్వ్యూలో స్పష్టత ఇచ్చారు. తాను తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును ఎన్నడూ, ఏనాడూ వ్యతిరేకించలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం అప్పటి ప్రభుత్వం అనుసరించిన అశాస్త్రీయ, ఏకపక్ష విభజన విధానాన్ని మాత్రమే తాను తప్పుబట్టానని పునరుద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అద్భుతంగా అభివృద్ధి చెందాలన్నదే తన నిరంతర ఆకాంక్ష అని వివరించారు. తెలంగాణలో సైతం జనసేన పార్టీ పోటీ చేయాలని, అక్కడ పార్టీని బలోపేతం చేయాలని క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల నుంచి గట్టి ఒత్తిడి వస్తోందని, భవిష్యత్తులో దానికి అనుగుణంగా అడుగులు వేస్తామని వెల్లడించారు. భాషా రాజకీయాలు, ఐటీ రంగంలో ఉపాధి కల్పన, ఉచిత పథకాల వల్ల ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం, తన వ్యక్తిగత ఆధ్యాత్మిక విశ్వాసాల వంటి వైవిధ్యభరితమైన అంశాలపై ఆయన తనదైన శైలిలో విశ్లేషణాత్మక అభిప్రాయాలను పంచుకున్నారు.

# అమరావతికి గుడ్ న్యూస్

**ఢిల్లీ, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేంద్రం భారీ శుభవార్త తెలిపిందని కేంద్రం ఆరోగ్య, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి సమావేశమైంది. ఈ సమావేశంలో రాజధాని అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. అమరావతిలో రూ.2,500 కోట్ల విలువైన సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు ఆమోద ముద్ర పడిందని వివరించారు. దీనిని ఐదు ఎకరాల్లో 23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. రెండు భారీ టవర్లలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారని వివరించారు. అలాగే 1,800 కార్ల పార్కింగ్ సదుపాయంతో ఈ ఆధునిక కార్యాలయ సముదాయం నిర్మితమవుతుందని చెప్పారు. రూ.1,234 కోట్లతో 17 ఎకరాల్లో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తారని తెలిపారు. 11 టవర్లలో 1,568 నివాస క్వార్టర్లు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, కమ్యూనిటీ హాల్స్, ఆధునిక సదుపాయాలతో గేటెడ్ కమ్యూనిటీ ఏర్పాటు అవుతుందని కేంద్ర మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. 2018లో ఈ ప్రతిపాదన చేస్తే.. 2024 తర్వాత ఇది వేగంగా ముందుకు సాగిందని చెప్పారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, ఆర్థిక శాఖల సహకారంతో ఈ ప్రాజెక్ట్‌కు ఆమోద ముద్ర పడిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు.




# తెలంగాణలో ఒంటరి పోరు

**ఢిల్లీ, మహా :** తెలుగు రాష్ట్రాల్లో పొత్తుల వ్యవహారంపై కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా కీలక ప్రకటన చేశారు. తెలుగుదేశం, జనసేన పార్టీలతో బీజేపీకి ఉన్న పొత్తు కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో జరిగిన చిట్‌చాట్ లో ఆయన తెలంగాణలో ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకునే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టారు. భవిష్యత్తులో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలతో పాటు, 2028లో రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని అమిత్ షా స్పష్టం చేశారు.

# బులియన్ మార్కెట్‌లో భారీ పతనం

- **రూ. 4,300 తగ్గిన తులం బంగారం రేటు**
- **మండిపడుతున్న ముడిచమురు సెగలు.**
- **ఆందోళనలో ఇన్వెస్టర్లు**

**ఢిల్లీ, మహా :** అంతర్జాతీయ మార్కెట్లో చోటు చేసుకుంటున్న అనూహ్య పరిణామాలు దేశీయ బులియన్ మార్కెట్‌ను ఒక్కసారిగా కుదిపేశాయి. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయి ధరలతో సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్న పసిడి, వెండి ధరలు బుధవారం మార్కెట్లో భారీగా క్షీణించాయి. అంతర్జాతీయ విపణిలో ముడిచమురు (క్రూడ్ ఆయిల్) ధరలు ఒక్కసారిగా రెక్కలు విప్పడం, దానికి తోడు అమెరికా డాలర్ విలువ విపరీతంగా బలపడటమే ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. పశ్చిమాసియాలో అమెరికాఇరాన్ దేశాల మధ్య మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో చమురు సరఫరాకు విఘాతం కలుగుతుందనే భయాలు మార్కెట్లను ముంచెత్తాయి. ఈ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ తీవ్రతను మరింత పెంచుతాయనే అంచనాల మధ్య, సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. దీంతో అంతర్జాతీయ పెట్టుబడిదారులు పసిడి మార్కెట్ నుంచి తమ పెట్టుబడులను వేగంగా ఉపసంహరించుకుంటున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రధాన



బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల (తులం) 22 క్యారెట్ల బంగారం ధర పన్నులతో కలుపుకుని ఏకంగా రూ. 4,300 మేర భారీ పతనాన్ని చవిచూసింది. ఈ భారీ తగ్గింపుతో ప్రస్తుతం తులం బంగారం ధర రూ. 1.56 లక్షల మార్కుకు చేరుకుంది. కేవలం బంగారం మాత్రమే కాకుండా పారిశ్రామికంగా, పెట్టుబడిగా ఎంతో ఆదరణ ఉన్న వెండి సైతం అదే దారిలో పయనించింది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో కిలో వెండి ధర సుమారు రూ. 10,000 మేర కుప్పకూలి రూ. 2.45 లక్షల వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఇదే తరహా ధోరణి కనిపించింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు దాదాపు 90 డాలర్ల మేర క్షీణించి, 4,168 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. అలాగే స్పాట్ సిల్వర్ ధర కూడా 2.24 శాతం మేర నష్టపోయి ఔన్సుకు 63.87 డాలర్లుగా నమోదైంది. ఈ స్థాయి పతనం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి కావడంతో నగల వర్తకులు, వినియోగదారులు ఒక్కసారిగా విస్మయానికి గురయ్యారు.

# భారత్‌లో పెను మార్పులను ప్రపంచం చూస్తోంది



**ఢిల్లీ, మహా :** దేశ రాజకీయాల్లో ఇది అత్యంత చారిత్రాత్మకమైన రోజు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి విజయవంతంగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో.. ఢిల్లీలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీకి కూటమి నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కూటమి సాధించిన విజయాలు, దేశ ప్రగతిపై ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఎన్డీఏ సాధించిన ఈ భారీ విజయం కేవలం ఒక్కరిది కాదని, కూటమిలో ఉన్న అన్ని భాగస్వామ్య పార్టీలకు ఈ విజయం దక్కుతుందని స్పష్టం చేశారు. 'భారతదేశంలో ఎక్కువ కాలం ప్రధానిగా సేవలు అందించే గొప్ప అవకాశాన్ని కల్పించిన దేశ ప్రజలందరికీ నేను శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. దేశాభివృద్ధి నిరంతరం సాగాలంటే ఒక స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు బలంగా కోరుకున్నారు. అందుకే ఎన్డీఏను మళ్లీ ఆశీర్వదించారు' అని మోదీ పేర్కొన్నారు. గత పాలకుల వైఫల్యాలను, తమ ప్రభుత్వ విజయాలను ప్రధాని ఈ సందర్భంగా బేరీజు వేశారు. 2014కు ముందు దేశంలో అవినీతి, పాలనా పక్షపాతం, నిర్ణయాలు తీసుకోలేని స్థితి వంటి అనేక తీవ్రమైన సమస్యలు ఉండేవని ప్రధాని గుర్తు చేశారు. 2014 తర్వాత ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక దేశ రూపురేఖల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు. దేశ ప్రజల్లో ప్రభుత్వంపై, వ్యవస్థలపై నమ్మకం పెరిగిందన్నారు. తాము గత 12 ఏళ్లలో ప్రవేశపెట్టిన వినూత్న పథకాలు, సంస్కరణల వల్ల దేశవ్యాప్తంగా వచ్చిన సానుకూల మార్పులను చూసి తాము గర్వపడుతున్నామని సగర్వంగా ప్రకటించారు. కాంగ్రెస్ పరిపాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని, రూ.వేల కోట్ల స్కాంలు జరిగాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని, దేశ వృద్ధిరేటు కూడా దారుణంగా ఉండేదని ప్రధాని మోదీ అన్నారు. తాము తెచ్చిన పథకాలతో దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చామని ప్రధాని మోదీ అన్నారు. అదేవిధంగా రైతుల జీవితాల్లో పెను మార్పులు తెచ్చాయని గుర్తు చేశారు. ఈ 12 ఏళ్లలో మహిళలు, యువతుల్లో ఆత్మ విశ్వాసం పెంచామనే సంతృప్తి ఉందన్నారు. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్యను 25 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచామని అన్నారు. భారత్ 2014కు ముందు ఎలా ఉందో.. ఇప్పుడెలా ఉందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కామెంట్ చేశారు. దశాబ్దాల పాటు పరిపాలించిన కాంగ్రెస్ ఏం చేసిందో ఆలోచించాలని అన్నారు. కరోనా సమయంలో అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు పతనం అయ్యాయని.. కానీ, భారత్ మాత్రం సగర్వంగా నిలబడిందని తెలిపారు. సంక్షోభ సమయంలోనూ 7.8 శాతం గ్రోత్ రేట్ ఉండటం మామూలు విషయం కాదన్నారు.

**లెక్కల ప్రభుత్వం కాదు..**

కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ అన్నారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని తెలిపారు. ఇంటర్నెట్, డిజిటలైజేషన్‌లో గణనీయ వృద్ధి సాధించామని అన్నారు. గతంలో ఆర్టికల్ 370 అంటే భయపడేవారని, తాము వచ్చి రద్దు చేశామని తెలిపారు. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారని, తాము వచ్చాకే దాడులు చేసి అణచివేశామని అన్నారు. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించామని, భారత్‌లో వస్తున్న పెను మార్పులను ప్రపంచం ఆసక్తిగా చూస్తోందని ప్రధాని మోదీ అన్నారు.

# మూల్యం చెల్లించుకోక తప్పదు

**ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్**

**మహా :** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగిన వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ చాలా ఎక్కువ సమయం తీసుకుంటోందని అన్నారు. ఇప్పుడు అందుకు ఇరాన్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో ఈ కామెంట్స్ చేశారు. ఇక్కడ మూల్యం చెల్లించుకోవడం అంటే ఏంటో, ఏ విధంగా చర్యలు తీసుకుంటారో స్పష్టమైన అర్థం వచ్చేలా ట్రంప్ వెల్లడించలేదు. బుధవారం తెల్లవారుజామున ఇరు దేశాలు పరస్పరం భీకర దాడులు చేసుకున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'ఇరాన్‌కు ఎంతో మేలు చేకూర్చే ఒప్పందం కుదుర్చుకునేందుకు వారు చాలా ఎక్కువ సమయం తీసుకున్నారు. ఇప్పుడు ఆ ఆలస్యానికి మూల్యం చెల్లించుకోక తప్పదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగానే ఇరాన్ సైన్యం తమ ముందు పూర్తిగా ఓడిపోయిందని ట్రంప్ అన్నారు.





# సుప్రీంకోర్టుకు కాంగ్రెస్

**మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై పోరు**



ఢిల్లీ, మహా : మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అత్యవసర విచారణ కోరింది. తెలంగాణలో తనపై నమోదైన కేసు వివరాలను నామినేషన్ అఫిడవిట్‌లో వెల్లడించలేదన్న బీజేపీ అభ్యంతరం ఆధారంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. అయితే ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసు నమోదు కాలేదని, కేవలం కోర్టు నోటీసు మాత్రమే జారీ అయిందని కాంగ్రెస్ వాదిస్తోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీలు కే.సి. వేణుగోపాల్, జైరాం రమేష్, రణ్‌దీప్ సుర్జేవాలా సహా పలువురు నేతలు ఎన్నికల సంఘాన్ని కలిసి తమ వాదన వినిపించారు. మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఎన్నికల సంఘానికి అందించామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్‌పై క్రిమినల్ కేసు ఉన్నట్లు చెప్పడం సమంజసం కాదన్నారు. సంబంధిత కోర్టు ఇప్పటివరకు కేసును స్వీకరించలేదన్నారు. అది వెల్లడించాల్సిన కేసుల పరిధిలోకి రాదని వివరించారు. మరోవైపు పౌరహక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్ కూడా రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్ని తప్పుబట్టారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కోర్టు అభియోగాలు నమోదు చేసిన తర్వాత మాత్రమే ఆ వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్‌ను తిరస్కరించడం చట్ట విరుద్ధమని అభిప్రాయపడ్డారు.

# తెలంగాణలో నో 'ఫ్రెండ్లీ పోలీసింగ్'




**అదిలాబాద్ , మహా :** సామాన్య ప్రజలను మేము ఎల్లప్పుడూ గౌరవిస్తాం.. వారి సమస్యల పరిష్కారంలో స్నేహపూర్వకంగా ఉంటాం.. కానీ సమాజంలో అశాంతి రేకెత్తించే రౌడీలు, గుండాల పట్ల ఇకపై ఎలాంటి ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండదు.. వారిపై ఉక్కుపాదం మోపుతాం.." అంటూ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్ చేసిన సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా జరిగిన ఉన్నతస్థాయి పోలీస్ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి పోలీస్ శాఖ సన్నద్ధతపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశానికి ఆ రేంజ్ ఐజీలు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ వ్యవస్థలో తీసుకురాబోతున్న విప్లవాత్మక మార్పులను వివరించారు.

**ఇకపై 'నో ఫ్రెండ్లీ పోలీసింగ్'**

గత కొంతకాలంగా రాష్ట్రంలో అమలవుతున్న 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానంపై డీజీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై రాష్ట్రంలో పాత తరహా ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ మార్పు కేవలం నేరస్తులకేనని, సామాన్య ప్రజల పట్ల పోలీసుల వైఖరి మరింత బాధ్యతాయుతంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చట్టాన్ని గౌరవించే సామాన్య ప్రజలకు పోలీస్ స్టేషన్లలో పూర్తి స్థాయి గౌరవం, మర్యాద లభిస్తాయని, వారి సమస్యల పరిష్కారానికి పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని స్పష్టం చేశారు. కానీ, సమాజంలో అశాంతి రేకెత్తించే రౌడీ షీటర్లు, గుండాలు, అసాంఘిక శక్తుల పట్ల మాత్రం ఇకపై ఎలాంటి ఉదాసీనత ఉండబోదని, వారిని ఉక్కుపాదంతో అణిచివేస్తామని డీజీపీ కఠిన హెచ్చరికలు జారీ చేశారు.

**గ్రేహౌండ్స్ విభాగం రద్దు.. కొత్త విభాగాల ఏర్పాటు**


ఈ సమావేశంలో అత్యంత కీలకమైన మరియు సంచలనాత్మకమైన ప్రకటన గ్రేహౌండ్స్ విభాగానికి సంబంధించినది. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజాన్ని అణిచివేయడంలో కీలక పాత్ర పోషించిన ఎలైట్ యాంటీనక్సల్ ఫోర్స్ 'గ్రేహౌండ్స్' విభాగాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. దశాబ్దాల తరబడి రాష్ట్రంలో నెత్తుటేరులు పారించిన మావోయిజం తెలంగాణ గడ్డపై పూర్తిగా అంతమైపోయిందని, ప్రస్తుతం రాష్ట్రంలో ఆ ముప్పు లేనందున గ్రేహౌండ్స్ విభాగం అవసరం తీరిపోయిందని ఆయన వివరించారు. ఈ మేరకు ఆ విభాగంలో అత్యుత్తమ శిక్షణ పొందిన సుమారు 1700 మంది కమాండోలను, సిబ్బందిని ఇతర కొత్త ప్రత్యేక విభాగాలకు బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తగా పుట్టుకొస్తున్న నేరాలను అరికట్టేందుకు ఈ సుశిక్షితులైన సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నారు.

**సైబర్‌క్రైమ్, డ్రగ్స్ నివారణే ప్రధాన లక్ష్యం**

మావోయిజం అంతమైనప్పటికీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త సవాళ్లను విసురుతోందని డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర పోలీసులకు సైబర్ క్రైమ్ అతిపెద్ద సవాలుగా మారిందని ఆయన అంగీకరించారు. ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ నేరాలను అరికట్టేందుకు, సైబర్ నేరగాళ్ల ఆట కట్టించేందుకు పోలీస్ శాఖను సాంకేతికంగా మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, యువత భవిష్యత్తును చిదిమేస్తున్న గంజాయి, డ్రగ్స్ మహమ్మారిపై కూడా ఆయన సీరియస్‌గా స్పందించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నామని, డ్రగ్స్ ముఠాల మూలాలను ఛేదించడానికి తమ శాఖ అత్యంత పకడ్బందీగా పనిచేస్తోందని డీజీపీ వివరించారు.

**ఆదిలాబాద్ పోలీసుల పనితీరుపై ప్రశంసలు**

ఈ సమీక్షా సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా పోలీసుల పనితీరును డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా కొనియాడారు. జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణ, నేరాల నియంత్రణలో ఆదిలాబాద్ పోలీసులు అద్భుతమైన పనితీరును కనబరుస్తున్నారని ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. విధి నిర్వహణలో నిబద్ధత చూపుతూ, ప్రజలకు చేరువగా ఉంటూనే నేరస్తులపై కఠినంగా వ్యవహరిస్తున్న తీరు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.



# టీడీపీకి లోక్ సభ డిప్యూటీస్పీకర్?

**చంద్రబాబుదే తుది నిర్ణయం**

**అమరావతి, మహా :** లోక్ సభ డిప్యూటీ స్పీకర్ పదవి టిడిపికి దక్కే ఛాన్స్ ఉందన్న చర్చ జరుగుతోంది. ఈ పదవి కోసం టీడీపీ నుంచి అమలాపురం ఎంపీ హరీష్, బాపట్ల ఎంపీ క్రిష్ణ ప్రసాద్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అమరావతికి చట్టబద్ధత సమయంలోనూ క్రిష్ణ ప్రసాద్ స్పీకర్ స్థానంలో ఉన్న సమయంలో బిల్లుకు ఆమోదం లభించింది. అయితే, గతంలో బాలయోగి స్పీకర్ గా పని చేసారు. ఇప్పుడు ఆయన తనయుడుకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. డిప్యూటీ స్పీకర్ పదవి టీడీపీకి ఇవ్వాలనే ఆలోచన వేళ.. ఎవరికి ఇస్తారనేది సీఎం చంద్రబాబు అధికారికంగా నిర్ణయం ప్రకటించాల్సి ఉంది.

# కార్పొరేట్ రంగంలో ఏఐ విప్లవం

**హైదరాబాద్, మహా:** సమాచార సాంకేతిక (ఐటీ) రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం సరికొత్త పుంతలు తొక్కుతోంది. కేవలం కోడింగ్, ఆటోమేషన్‌కే పరిమితం కాకుండా, ఏఐ సాంకేతికతను వ్యాపార వృద్ధికి అద్భుతమైన సాధనంగా మలచుకోవచ్చని ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ నిరూపించింది. సంస్థలోని ఉద్యోగుల ఈమెయిల్స్, రోజువారీ చాట్స్, అంతర్గత సమావేశాల డేటాను ఏఐ ద్వారా లోతుగా విశ్లేషించడం ద్వారా భారీ ఎత్తున కొత్త వ్యాపార అవకాశాలను సృష్టిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ వినూత్న వ్యూహం ద్వారా ఇప్పటికే దాదాపు 200 మిలియన్ డాలర్ల (సుమారు రూ.1,700 కోట్లు) అదనపు బిజినెస్ అవకాశాలను తమ ఖాతాలో వేసుకున్నట్లు సంస్థ ప్రకటించింది. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంలో కాగ్నిజెంట్ అనుసరిస్తున్న ఈ సరికొత్త పంథా ప్రస్తుతం అంతర్జాతీయ కార్పొరేట్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది.

సంస్థలో రోజువారీగా జరిగే వేలాది సంభాషణలు, క్లయింట్లతో నిర్వహించే సమావేశాలు, అంతర్గత చర్చల నుంచి అత్యంత విలువైన సమాచారాన్ని ఏఐ వ్యవస్థల ద్వారా వెలికితీస్తున్నామని కాగ్నిజెంట్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) రవి కుమార్ స్పష్టం చేశారు. ఈ సమాచార విశ్లేషణ ఆధారంగా కస్టమర్ల అవసరాలను, వారి వ్యాపార ఇబ్బందులను సంస్థ కంటే ముందే గుర్తించి, వాటికి తగినట్లుగా కొత్త ప్రాజెక్టులను, వినూత్న సేవలను ప్రతిపాదిస్తున్నామని ఆయన వివరించారు. ఉదాహరణకు.. ఒక ప్రముఖ కస్టమర్ తన ఇంజినీరింగ్ వ్యయాలను తగ్గించుకోవాలని యోచిస్తున్నట్లు జరిగిన సంభాషణలను ఏఐ గుర్తించింది. వెంటనే స్పందించిన కాగ్నిజెంట్ బృందం, ఆ కస్టమర్ యొక్క నాణ్యతా పరీక్షల (క్వాలిటీ టెస్టింగ్) ప్రక్రియను ఆధునీకరించి ఖర్చులను తగ్గించేలా ఒక చక్కని ప్రతిపాదనను సిద్ధం చేసి అందించింది. ఇది కస్టమర్‌కు భారీగా ఖర్చులను ఆదా చేయడంతో పాటు, కాగ్నిజెంట్‌కు ఒక సరికొత్త ప్రాజెక్ట్ దక్కేలా చేసిందని సంస్థ ఉదహరించింది. వ్యాపార విస్తరణతో పాటు అంతర్గత నిర్వహణలోనూ ఏఐ అద్భుతమైన పాత్ర పోషిస్తోందని ఐటీ దిగ్గజం పేర్కొంది. వివిధ ప్రాజెక్టుల పురోగతిలో భవిష్యత్తులో తలెత్తే సాంకేతిక, ఆర్థిక సమస్యలను (ప్రాజెక్ట్ రిస్క్స్) ఈ సాంకేతికత ముందే అంచనా వేసి హెచ్చరిస్తుందని వెల్లడించింది. దీనివల్ల నష్ట నివారణ చర్యలు చేపట్టడం సులువవుతుందని, అలాగే ప్రాజెక్టు అవసరాలకు తగిన నైపుణ్యాలు కలిగిన సరైన ఉద్యోగులను సరైన స్థానాల్లో ఎంపిక చేయడానికి (రిసోర్స్ మేనేజ్మెంట్) కూడా ఈ ఏఐ అల్గారిథమ్స్ ఎంతో దోహదపడుతున్నాయని వివరించింది. డేటా విశ్లేషణలో గోప్యతా ప్రమాణాలను పాటిస్తూనే, వ్యాపార ప్రగతికి ఏఐని ఎలా ఉపయోగించవచ్చో ఈ విధానం స్పష్టం చేస్తోంది. ఇదిలా ఉండగా, గత కొన్ని రోజులుగా ఉద్యోగుల వేతన పెంపుదలపై వస్తున్న రకరకాల ఊహాగానాలకు కాగ్నిజెంట్ యాజమాన్యం గట్టి బ్రేక్ వేసింది. అర్హులైన ఉద్యోగులందరికీ ప్రతిభాధారిత (మెరిట్ బేస్డ్) వేతన పెంపులు ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచే అమలులోకి వస్తాయని సీఈఓ రవి కుమార్ అధికారికంగా స్పష్టం చేశారు. జీతాల పెంపు ప్రక్రియ వాయిదా పడిందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను సంస్థ తీవ్రంగా ఖండించింది. గత ఏడాది ఏ తరహా షెడ్యూల్ అనుసరించామో, ఈసారి కూడా అదే విధంగా ఆగస్టు నెలలోనే పెంపులను అమలు చేస్తామని, ఇందులో ఎలాంటి సందేహాలు అవసరం లేదని యాజమాన్యం పేర్కొంది. దాంతో పాటు ఉద్యోగులకు అందాల్సిన వార్షిక బోనస్‌లను సైతం యథావిధిగా, సకాలంలోనే అందజేస్తామని స్పష్టం చేయడంతో కాగ్నిజెంట్ ఉద్యోగుల్లో నెలకొన్న అనిశ్చితి తొలగిపోయి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# మోదీకి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆత్మీయ శుభాకాంక్షలు

- దిల్లీలోని భారత్ మండపంలో అట్టహాసంగా ఎన్డీయే పక్షాల భేటీ.
- ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీకి ప్రత్యేక అభినందనలు.
- రాష్ట్ర ప్రగతి, కేంద్ర సహకారంపై ఇరువురి మధ్య ఆసక్తికర చర్చ.



**ఢిల్లీ, మహా :** దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ సుదీర్ఘంగా పన్నెండేళ్ల పదవీకాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న అరుదైన, చారిత్రక తరుణంలో పవన్ కల్యాణ్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశం అనంతరం ప్రధానితో ప్రత్యేకంగా భేటీ అయిన జనసేనాని.. మోదీ నాయకత్వంలో దేశం మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు.

**ఆత్మీయ ఆలింగనం.. అభినందనల వెల్లువ**

భారత్ మండపంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశం ముగిసిన అనంతరం ప్రధాని మోదీ వద్దకు వెళ్లిన పవన్ కల్యాణ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానిగా ఒక దశాబ్దానికి పైగా కాలంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టి, దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో విశ్వగురు స్థానంలో నిలబెట్టేందుకు మోదీ చేస్తున్న అలుపెరగని కృషిని ఈ సందర్భంగా పవన్ కొనియాడారు. జనసేనాని అభినందనలు స్వీకరించిన మోదీ.. ఆయనను ఎంతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అఖండ విజయంలో పవన్ కల్యాణ్ పోషించిన కీలక పాత్రను, ఆయన ప్రదర్శించిన రాజకీయ పరిణతిని మోదీ మరోసారి ప్రశంసించినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా ఎన్డీయే కూటమి బలోపేతానికి, సిద్ధాంతాల పట్ల జనసేన కనబరుస్తున్న నిబద్ధత మరువలేనిదని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**రాష్ట్ర ప్రగతిపై ప్రత్యేక చొరవ**

సుదీర్ఘంగా సాగిన ఈ ఆత్మీయ కలయికలో కేవలం రాజకీయ అంశాలే కాకుండా ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధిపై ఇరువురు నేతల మధ్య లోతైన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, పాలనాపరమైన సంస్కరణలను డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ ప్రధానికి వివరించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన సవాళ్లను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి మరింత అండదండలు అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రగతి, సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల కల్పన, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం తదితర కీలక అంశాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

**కేంద్రం అండగా ఉంటుంది: ప్రధాని మోదీ**

పవన్ కల్యాణ్ చేసిన విజ్ఞప్తులపై ప్రధాని మోదీ ఎంతో సానుకూలంగా స్పందించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి, రాష్ట్ర పురోగతికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ప్రధాని భరోసా ఇచ్చారు. "సబ్ కా సాథ్ సబ్ కా వికాస్" నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే ఆలోచనా విధానంతో సమన్వయంగా అడుగులు వేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు.

# భవిష్యత్ తరాలకు భారత్ ఫ్యూచర్ సిటీ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (ఫ్యూచర్ సిటీ), మహా :** తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును ప్రగతి పథంలో నడిపించే చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మరో నవ నగరం దిశగా కీలక అడుగు వేశారు. హైదరాబాద్ మహానగర కీర్తి కిరీటంలో మరో మైలురాయిగా నిలవనున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో పరిపాలనను అత్యాధునిక సాంకేతికతతో ప్రజలకు అందించేందుకు రెండెకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించిన 'భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ' కార్యాలయాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీకి సంబంధించిన అధికారిక లోగో, ప్రత్యేక పోర్టల్ మరియు వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లతో కలిసి నూతన కార్యాలయ ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యూచర్‌సిటీ వేదికగా రాబోయే రోజుల్లో సుపాలన అందించే దిశగా తమ ప్రభుత్వం ముందడుగు వేసిందని, రేపటి ఉజ్వల భవిష్యత్తుకు ఈనాడే బలమైన పునాదులు వేశామని ముఖ్యమంత్రి సగర్వంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. భాగ్యనగరానికి ఎంతో గొప్ప చారిత్రక నేపథ్యం ఉందని కొనియాడారు. నాడు కుతుబ్‌షాహీలు, నిజాం రాజులు చేసిన విశేష కృషి వల్లే హైదరాబాద్ ఇంతగా అభివృద్ధి చెందిందని స్మరించుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న మొత్తం ఆదాయంలో సింహభాగం, అంటే ఏకంగా 60 శాతం ఆదాయం ఒక్క హైదరాబాద్ నగరం నుంచే లభిస్తోందని , ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని భూములు ప్రస్తుతం బంగారం కంటే ఎక్కువ విలువైనవిగా మారాయని వ్యాఖ్యానించారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీని నిర్మిస్తామంటే ఎగతాళి చేస్తూ నవ్విన వాళ్లు ఉన్నారని, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, జీనోమ్ వ్యాలీ, ఐటీ సంస్థల స్థాపనను ఆనాడు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. నాడు గనుక ఆ ఐటీ పరిశ్రమలు, మౌలిక వసతులు రాకపోయి ఉంటే.. ఈనాడు మన తెలంగాణ యువతకు ఇంతటి భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించేవా అని ఆయన ప్రశ్నించారు.



**బీఆర్ఎస్ నాయకులను బండకేసి కొడతారు**

తాము అధికారంలోకి వస్తే ప్రతిష్టాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేస్తామని బీఆర్ఎస్ నాయకులు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ ఫ్యూచర్ సిటీ అనేది కేవలం మన రాష్ట్రానికో, దేశానికో పరిమితమైంది కాదని.. ఇది యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే అంతర్జాతీయ ప్రాజెక్టు అని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ ప్రతిపక్షాలు తమ పాత వైఖరిని మార్చుకోకుండా ఇలాగే ప్రవర్తిస్తే, రాబోయే రోజుల్లో వారికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు చెలామణిలో లేని, రద్దయిన వెయ్యి రూపాయల నోటు లాంటిదని, ఆ పార్టీని ప్రజలు ఎప్పుడో తిరస్కరించారని ఎద్దేవా చేశారు. భవి ష్యత్ నగరాన్ని రద్దుచేస్తామంటే ప్రజలు బండకేసి కొడతారన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న దీర్ఘకాలిక ప్రణాళికల వల్ల రాబోయే 2034 నాటికి ఫ్యూచర్ సిటీ సుమారు ట్రిలియన్ డాలర్ల భారీ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. జపాన్ రాజధాని టోక్యో, అంతర్జాతీయ వ్యాపార కేంద్రమైన సింగపూర్ నగరాల తరహాలో ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు.

**కబ్జాకోరులపై ఉక్కుపాదం మోపుతాం..**

బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదని.. తమ అభివృద్ధి ప్రయత్నం మాత్రం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరులపై ఉక్కుపాదం మోపుతామని.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు.

# 2027 వేసవి నాటికి మేడిగడ్డ పునరుద్ధరణ

- జూలై తొలి వారానికి సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తి.
- సెప్టెంబర్ నాటికి డిజైన్లు సిద్ధం.. నవంబర్‌లో పనుల షురూ.
- బీఆర్ఎస్ లోపాల వల్లే బ్యారేజీలకు నష్టం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.



**మేడిగడ్డ (కాళేశ్వరం),మహా :** నిర్మాణ లోపాలు, గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల వల్ల దెబ్బతిన్న మేడిగడ్డ బ్యారేజ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపడుతున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. 2027 వేసవి నాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేసి, ప్రాజెక్టులను తిరిగి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం మేడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.

**నవంబర్ చివరి వారంలో పనులు ప్రారంభం***

బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాలపట్టికను విడుదల చేశారు. జూలై తొలి వారానికి అన్ని రకాల సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, ఆ నివేదికలను కేంద్ర జల సంఘం , జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ లకు సమర్పిస్తామని తెలిపారు. ఆయా సంస్థల సూచనలు, ఆమోదం మేరకు సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామన్నారు. వర్షాకాలం ముగిసిన వెంటనే, నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో పునరుద్ధరణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. ఒకే పని సీజన్‌లో పనులన్నీ పూర్తి చేసి 2027 వేసవి కాలం నాటికి బ్యారేజీలను రైతులకు అందుబాటులోకి తెస్తామని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో జీపీఆర్ పరీక్షలు 90 శాతం, బోర్‌హోల్ పరిశోధనలు 80 శాతం ముగిశాయని, జూన్ ఆఖరుకు అన్ని పరీక్షలు పూర్తవుతాయని వెల్లడించారు.

**అంతర్జాతీయ నిపుణులతో పునరుద్ధరణ ప్రణాళికలు**

ఈ అత్యంత ప్రతిష్టాత్మక పునరుద్ధరణ ప్రక్రియ కోసం ప్రపంచ ప్రఖ్యాత కన్సల్టెంట్ సంస్థ 'ఏ ఎఫ్ ఆర్ వై 'తో పాటు ఐఐటీ బొంబాయిని నియమించినట్లు మంత్రి తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో నమూనా అధ్యయనాలు జరుగుతున్నాయని, జాతీయ, అంతర్జాతీయ నిపుణులను కూడా ఇందులో భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్‌డీఎస్ఏ గుర్తించిన స్కౌర్ డెప్త్, కట్ ఆఫ్ డెప్త్, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్, ఎనర్జీ డిసిపేషన్, గేట్ల నిర్వహణ వంటి కీలక అంశాలపై సమగ్ర అధ్యయనాలు జరుగుతున్నాయని వివరించారు.

*గత పాలకుల వల్లే ఖజానాపై భారీ భారం*

బీఆర్ఎస్ పాలకుల లోపభూయిష్ట విధానాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు దెబ్బతిన్నాయని మంత్రి ఉత్తమ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2023 అక్టోబర్‌లో జరిగిన ఈ నష్టానికి గత ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,000 కోట్ల అంచనా వ్యయంతో ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభిస్తే, తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ పేరుతో వ్యయాన్ని లక్ష కోట్ల పైచిలుకు పెంచిందని విమర్శించారు. కాగ్ అంచనాల ప్రకారం ఈ వ్యయం రూ.1.45 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందన్నారు. ఇంత భారీ ప్రజాధనాన్ని ఖర్చు చేసినప్పటికీ, బ్యారేజీలు దెబ్బతినడం వల్ల 2023 డిసెంబర్ నుంచి ఇవి వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర ఖజానాపై మోయలేని భారాన్ని మోపాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు, ప్రాజెక్టుల భద్రతకే అత్యున్నత ప్రాధాయం ఇస్తోందని స్పష్టం చేశారు. గతంలో జరిగిన తప్పిదాలన్నింటినీ సరిదిద్ది, శాశ్వత భద్రతా ప్రమాణాలతో బ్యారేజీలను పునరుద్ధరించి, తెలంగాణ రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుస్తామని మంత్రి పునరుద్ఘాటించారు.

# ఆడాళ్లు మీకు జోహార్లు




ఆడాళ్లు. మీకు జోహార్లు. ఓపిక, వద్దిక మీ పేర్లు.మీరు ఒకరి కంటే ఒకరు గొప్పోళ్ళు. అంటూ ఓ సినీ కవి అతివల గొప్పతనం చెప్పుకొచ్చారు. తెలంగాణలో అతివలు ఈ మాటలు అక్షరాల నిజం చేస్తున్నారు. ఒకటి కాదు. రెండు కాదు. ఏకంగా 553 ఆర్టీసీ బస్సులకు తెలంగాణ మహిళలు ఓనర్లు అయ్యారు.ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో తెలంగాణ మహిళలు దూసుకుపోతున్నారు అనేందుకు ఇది ఓ ప్రత్యక్ష నిదర్శనం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ ప్రతినబూనిన సీఎం రేవంత్ రెడ్డి ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మున్ముందు స్వయం సహాయక మహిళా సంఘాలకు మరో మూడు వేల ఆర్టీసీ బస్సులు కూడా ఇచ్చేందుకు సిద్ధమని సీఎం ప్రకటించిన నేపథ్యంలో మున్ముందు తెలంగాణలో ఆర్టీసీలో మహిళా ప్రాధాన్యతకు ప్రభుత్వం పెద్దపీట వేసేలా కనిపిస్తోంది. ఇక్కడితో దీన్ని సరి పెట్టుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదు.. వ్యవసాయ రంగంలోనూ విప్లవాత్మక మార్పులకు మహిళా రైతులను సన్నద్ధం చేసే ప్రయత్నం మొదలు పెట్టబోతోంది... ముఖ్యంగా పంట మార్పిడి విషయంలో మహిళా సంఘాలను చైతన్యవంతం చేసే ప్రణాళిక కూడా ప్రభుత్వం వద్ద వుందనే విషయం సీఎం రేవంత్ చెప్పుకుని వచ్చారు.

వ్యవసాయరంగంలో మహిళా రైతుల చొరవ పెరిగితే పంట మార్పిడి సులువుగా జరుగుతుందని, ఇది వ్యవసాయంలో అతి పెద్ద మార్పునకు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.. పారిశ్రామిక రంగంలోలో ఇప్పటికే మహిళలు ప్రతిభ చూపుతున్నారు... దీన్ని దృష్టిలో పెట్టుకొని అయిదు వందల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు తెలంగాణ మహిళలకు ప్రభుత్వం అందించింది.భవిష్యత్ అంతా మహిళలదే, వారి సామర్థ్యంతో మున్ముందు అద్భుతమైన ప్రగతి సాధిస్తాం అంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆత్మ విశ్వాసం వ్యక్తం చేయటం రాజకీయ రంగంలోనూ మహిళలకు సమూచిత స్థానం కలిపిస్తామని భరోసా ఇవ్వటం ఇక్కడ గమనించాలి.వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించే అంశం కూడా రేవంత్ రెడ్డి ప్రస్తావనకు తెచ్చి మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందనే విషయం రుజువు చేసే ప్రయత్నం గట్టిగా చేస్తున్నారు... ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు అన్నీ మహిళల పేర్లతోనే ఇప్పుడు మంజూరు అవుతున్నాయి... ఇది ఓ విప్లవం అంటారు కాంగ్రెస్ నేతలు. మహిళా అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్రం ఓ ఆదర్శంగా నిలుస్తుందని వారు గర్వంగా చెప్పేసుకుంటున్నారు.రాష్ట్రంలోని రెండు కోట్లకు పై చిలుకు వున్న మహిళలందరికి ఏదో ఓ పథకం ద్వారా లబ్ది చేకూర్చే విధానం ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తోంది... ఇదే 2034లో అధికారం కోసం కాంగ్రెస్ ముందస్తుగా వేసుకుంటున్న పునాది... ఇందులో ఎలాంటి సందేహం లేదు అంటారు కొందరు...

మహిళలకు పెట్రోల్ బంకులు ఇప్పటికే కేటాయించిన తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది... మహిళ అన్నీ రంగాల్లో ముందు ఉంటే కుటుంబ వ్యవస్థ బాగుంటుందని, ఇది ఓ మంచి సమాజ స్థాపనకు మూల స్థంభం అవుతుందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.నిజానికి మహిళలకు ఓర్పు, నేర్పు ఎక్కువ.సహనం, దూర ఆలోచన వారి తత్త్వం. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న చేయూతతో తెలంగాణ మహిళల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. విద్యా, వైద్యా, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాలలో మహిళలు ఇప్పుడు ముందే వుంటున్నారు. తెలంగాణలో ఇటీవల కాలంలో మహిళల ప్రతిభ వెలుగు చూస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో ప్రోత్సాహం అందిస్తోంది. మహిళల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీకి పూర్తి బలం కాబోతోందని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. భవిష్యత్ లో మహిళల కోసం ప్రభుత్వం మరిన్ని పథకాలు కూడా తెచ్చే అవకాశం లేకపోలేదు అంటున్నారు కాంగ్రెస్ నాయకులు...

ఓ మంచి లక్ష్యంతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది... ప్రభుత్వం సంస్థల్లో ఇప్పటికే మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

వారి స్థితిగతులు బాగానే వున్నాయి.ప్రైవేట్ సంస్థలోనూ మహిళా ఉద్యోగులు రాణిస్తున్నారు. పోలీస్, న్యాయ వ్యవస్థ, ఆర్టీసీ వంటి సంస్థల్లో ఇప్పుడు మహిళల సంఖ్య పెరుగుతోంది... అయితే మహిళలకు సామాన అవకాశాలు కేవలం నగరాలకు మాత్రమే పరిమితం అవుతున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా వుంది.పరిశ్రమ, నిర్మాణ రంగాల్లో పురుషులకు సమానంగా మహిళలు కష్ట పడుతున్నా వేతనాల చెల్లింపులలో భారీ వ్యత్యాసం కనిపించడం గమనార్హం. భద్రత, లింగ వివక్ష, అఘాయిత్యాలు, అణచివేత ధోరనుల వంటి ఘటనలు వెలుగు చూస్తూనే వున్నాయి.హైదరాబాద్ వంటి నగరాల్లో కూడా ఇవి బయట పడుతున్నాయి.ఇలాంటి వాటిపై కూడా ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టాల్సి వుంది... మహిళా సాధికారిత ఓ మంచి పరిణామం. అందులో సందేహం లేదు...దాని ఆచరణ పరిధి క్షేత్ర స్థాయి వరకు వేడితేనే ఫలితాలు అందరికి చేరుతాయి. కేవలం నగరాలకు మాత్రమే ఇది పరిమితం అయితే ప్రగతి కూడా అక్కడే నిలిచి పోతుంది... ఇప్పటి వరకు జరిగింది ఇదే. అందుకే ప్రభుత్వాలు ఎన్ని మహిళా సంక్షేమ పథకాలు తీసుకొని వచ్చినా ఆశించిన ప్రయోజనం అతివల దరికి చేరలేదు.. ఈ నిజం పాలకులు గుర్తించాల్సిందే.

అన్నీ విషయాలలో మహిళలు దూసుకుపోవాలి అంటూ పాలకులు అంటున్నారు.అది అంత తేలిక విషయం కాదు. సామాజిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితి కూడా దానికి దోహదం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు విద్యా విషయంలో వెనుకబడే వున్నారు. నూటికి 36 శాతం మంది అతివలు ఇంటర్ తోనే చదువులకు స్వస్తి చెప్తుతున్నారు. డిగ్రీ చదివిన మహిళల్లో 23 శాతం మందే ఉద్యోగాలు చేస్తున్నారు.పదవ తరగతి వరకు మాత్రమే చదువు సాగించి తర్వాత ఇంటికే పరిమితం అవుతున్న మహిళల సంఖ్య తెలంగాణలో పెద్ద ఎత్తున్న వుంది.కారణం ఏదైనా ఆశించిన స్థాయిలో మహిళలకు అవకాశాలు రావట్లేదు. దీన్ని పాలకులు ఒప్పుకుని తీరాల్సిందే. తెలంగాణలో ఎస్ సీ, ఎస్, టీ. వెనుకబడిన వర్గాలు ఎక్కువ. ఈ వర్గాల్లోని మహిళల పరిస్థితి ఇంకా ఇబ్బందికరంగానే వుంది. ప్రభుత్వాలు అందించే పథకాలు అందుకుని, వాటి ద్వారా భవిష్యత్ నిర్మాణం చేసుకునే పరిస్థితి వీరికి చేరటం లేదు. క్రీడలు, కళలు, చేతి వృత్తులు, ఇతర రంగాల్లో ప్రతిభ వున్నా గుర్తింపు లేక వేల సంఖ్యలో మహిళలు నిరాశావాదంలో నలిగి పోతూనే వున్నారు. ఇలాంటి దుస్థితిలో వున్న వారికి ప్రభుత్వం అందించే మహిళా ప్రోత్సాహం, చేయూత చేరువ కావాలి. అప్పుడు తెలంగాణలో మహిళల సాధికారిత అంశం లక్ష్యం చేరుకుంటుంది.ఆ దిశగా ప్రభుత్వం నిర్థిష్టమైన అడుగులు వేయాలి. కోటి మంది మహిళల ను కోటీశ్వరులను చేయాలి అంటే ఖచ్చితంగా పని చేసే యంత్రాంగం కూడా ఉండాలి. నిబద్దత, చిత్తశుద్ధి ఇందుకు అవసరం. అప్పుడే అతివకు న్యాయం జరుగుతుంది... అద్భుతమైన ఫలితం ప్రభుత్వం అందుకుంటుంది



జి. వెంకటరమణ
సీనియర్ జర్నలిస్ట్



# జయహో మోదీ

- కేంద్ర కేబినెట్ స్టాండింగ్ ఒవేషన్
- దేశాన్ని ఎక్కువ రోజులు పాలించిన నేతకు అభినందనలు
- నెహ్రూ రికార్డు బద్దలు

**ఢిల్లీ, మహా :** ప్రధానిగా ఎక్కువ రోజులు దేశాన్ని పాలించి రికార్డు సృష్టించిన నరేంద్ర మోదీని అభినందిస్తూ కేంద్ర మంత్రివర్గం బుధవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. కేంద్ర మంత్రులు కేబినెట్ సమావేశంలో లేచి నిలబడి ఘనంగా ఆయనకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.


ప్రధానిగా నరేంద్ర మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. మొదటి సార్వత్రిక ఎన్నికల తర్వాత అత్యధిక కాలం అంటే వరుసగా 4,398 రోజుల పాటు ప్రధానిగా సేవలు అందించిన మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఈ రోజుతో మోదీ అధిగమించారు. ఈ నేపథ్యంలో కేబినెట్ మంత్రులు ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు.

**నాకు ఇదే అసలైన పరీక్ష**

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ స్పందిస్తూ, ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అత్యంత పెద్ద పరీక్ష అని పేర్కొన్నారు. ఎక్స్‌లో ఓ సంస్కృత శ్లోకాన్ని ఆయన పోస్టు చేస్తూ దాని భావాన్ని వివరించారు. వినయం, అంకితభావం, కర్తవ్య నిష్ఠ అనేవి ప్రజల నమ్మకాన్ని సంపాదించడానికి అవసరమైన సద్గుణాలు అని అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, మన్సుఖ్ మాండవీయ, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త సహా వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నేతలు ప్రధాని మోదీ తరపున ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయాల్లో మోదీ తరపున పూజలు నిర్వహించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, భారత్‌లో అత్యధిక కాలం సేవలు అందించిన ఎన్నికైన ప్రధానిగా మోదీ నిలవడంపై ప్రశంసలు కురిపించారు. ఇది మోదీ పట్ల కోట్లాది మంది భారతీయుల ప్రేమ, నమ్మకం, అపారమైన ప్రజా మద్దతుకు నిదర్శనమని అన్నారు. ప్రధాని మోదీ సాగించిన ఈ 4,399 రోజుల ప్రయాణం శక్తివంతమైన, సంపన్నమైన, అభివృద్ధి చెందిన, స్వయంసమృద్ధ (ఆత్మనిర్భర్) భారత్ నిర్మాణంలో ఒక 'సువర్ణ అధ్యాయం' అని ఆయన కొనియాడారు.

## ప్రపంచవ్యాప్తంగా అభినందనలు

భారత్‌ను అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ వేదికపై భారత్ ఎదుగుదలకు మోదీ చేస్తున్న అపారమైన కృషిని మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కొనియాడారు. ఇక భారత్‌లో అమెరికా రాయబారిగా ఉన్న సెర్గియో గోర్ కూడా మోదీపై ప్రశంసలు కురిపించారు. "భారత్‌లో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన నరేంద్ర మోదీకి అభినందనలు. ఈ ఘనత దశాబ్దాలుగా ఆయన అంకితభావంతో చేసిన ప్రజాసేవకు, బలమైన నాయకత్వానికి నిదర్శనం. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు" అని అన్నారు. ప్రధాని మోదీ సాధించిన ఈ ఘనతపై ఎన్‌డీఏ నేతలతోపాటు, వివిధ దేశాల నేతలు, పలు రంగాల ప్రముఖులు నుంచి అభినందనలు తెలియజేశారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ, "మోదీ 12 ఏళ్ల పాలనా కాలాన్ని స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఒక గొప్ప మైలురాయి" అని అభివర్ణించారు. వలస రాజ్యాల పాలన వల్ల భారతీయులలో నాటుకుపోయిన న్యూనతా భావాన్ని దూరం చేయడానికి మోదీ సర్కార్ చేసిన కృషిని ఆయన కొనియాడారు.





# ఆకుపచ్చని జ్ఞాపకాల సీతాకోకచిలుక... భారతిరాజా

భారతీయ చలనచిత్ర రంగంలో గ్రామీణ జీవనానికి, సహజమైన ప్రేమ కథలకు కొత్త దృశ్యభాషను అందించిన దర్శకుడు భారతిరాజా. తమిళ సినీ పరిశ్రమలో 1970ల చివరలో ప్రారంభమైన ఆయన సినీ ప్రయాణం దక్షిణ భారత చిత్రసీమలో ఓ కొత్త ధోరణికి నాంది పలికింది. స్టూడియోలకే పరిమితమైన కథలను పల్లెల బాట పట్టించి, ప్రకృతి మధ్య మానవ సంబంధాల అందాన్ని వెండితెరపై ఆవిష్కరించిన దర్శకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.పల్లె జీవనంలోని స్వచ్ఛత, యువతలోని ప్రేమ, సామాజిక వాస్తవాలు, ప్రకృతితో మనిషి అనుబంధం వంటి అంశాలను భారతిరాజా తన చిత్రాల్లో సహజత్వానికి దగ్గరగా చిత్రించారు. అందుకే ఆయన సినిమాలు కేవలం వాణిజ్య విజయాలుగానే కాకుండా, దక్షిణ భారత సినీ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచాయి. నాలుగు దశాబ్దాలకు పైగా కొనసాగిన ఆయన సృజనాత్మక ప్రస్థానం అనేక మంది నటులు, సాంకేతిక నిపుణులకు మార్గదర్శకంగా నిలిచింది. భారతిరాజా మరణంతో భారతీయ చిత్రసీమ ఒక విలక్షణ దర్శకుడిని కోల్పోయినా, ఆయన సృష్టించిన కళాత్మక వారసత్వం చిరస్థాయిగా నిలిచిపోతుంది."అరే ఏమైందీ ఒక మనసుకు రెక్కలొచ్చి ఎచ్చటికో ఎగిరింది..." అనే పదహారేళ్ల వయసు కలల పాట నేడు మరింత అర్థవంతంగా అనిపిస్తోంది. నిజంగానే భారతిరాజా గారి "పదహారేళ్ల మనసు" ఎచ్చటికి ఎగిరిపోయిందో తెలియదు. కానీ ఆయన ఆత్మ మాత్రం ఆకుపచ్చని పొలాల మీదుగా, గాలిలో ఊగే వరి మొక్కల మధ్యగా, సముద్ర తీరాల నిశ్శబ్ద అలల వెంట ప్రయాణిస్తూ ఉంటుందనే భావన కలుగుతోంది.భారతిరాజా కేవలం దర్శకుడు కాదు. ఆయన ఒక కవి. కెమెరాను కలంగా, ప్రకృతిని కాగితంగా, మనుషుల భావోద్వేగాలను అక్షరాలుగా మార్చి ఎన్నో అద్భుతమైన ప్రేమకావ్యాలను తెరపై ఆవిష్కరించిన సృష్టికర్త. నగర జీవితపు కాంక్రీట్ గోడల మధ్య చిక్కుకుపోయిన భారతీయ సినిమాను ఆయన పల్లెల్లోకి తీసుకెళ్లారు. గ్రామం కూడా అందంగా ఉంటుందని, అక్కడి మనుషుల ప్రేమలు కూడా కవితల్లా ఉంటాయని ఆయన నిరూపించారు.తమిళ సినీ పరిశ్రమలో ఒక విప్లవాన్ని సృష్టించిన దర్శకుల్లో భారతిరాజా పేరు మొదటి వరుసలో నిలుస్తుంది. ఆయన రాకముందు సినిమాల్లో గ్రామీణ జీవితం ఎక్కువగా స్టూడియో సెట్లకే పరిమితమై ఉండేది. కానీ భారతిరాజా నిజమైన పల్లెలను తెరపైకి తీసుకొచ్చారు. పొలాలు, చెరువులు, మట్టి దారులు, పల్లెటూరి సంస్కృతి, అమాయకమైన ప్రేమలు, మనుషుల మధ్య ఉండే సహజ సంబంధాలు ఆయన సినిమాల్లో ప్రధాన పాత్రలుగా మారాయి.ఆయన చిత్రాల్లో ప్రకృతి ఒక నేపథ్యం కాదు. అది ఒక పాత్ర. గాలి మాట్లాడుతుంది. చెట్లు స్పందిస్తాయి. వర్షం ప్రేమను వ్యక్తం చేస్తుంది. సముద్రం విరహాన్ని వినిపిస్తుంది. అందుకే భారతిరాజా సినిమాలను చూస్తే ఒక కథను చూసిన అనుభూతి కంటే ఒక కవితను చదివిన అనుభూతి కలుగుతుంది.తెలుగు ప్రేక్షకులతో భారతిరాజాకు ఉన్న అనుబంధం కూడా ప్రత్యేకమైనది. ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలు తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. ముఖ్యంగా యువ హృదయాల భావోద్వేగాలను, తొలి ప్రేమలోని అమాయకత్వాన్ని, విరహంలో ఉండే వేదనను ఆయన ఎంతో సున్నితంగా ఆవిష్కరించారు. ప్రేమను ఆయన ఎప్పుడూ కేవలం ఇద్దరి మధ్య ఉండే సంబంధంగా చూడలేదు. అది మనిషి ఆత్మకు సంబంధించిన ఒక అనుభూతిగా చిత్రించారు.భారతిరాజా సినిమాల్లో మహిళా పాత్రలు కూడా ఎంతో బలంగా ఉంటాయి. అవి కేవలం కథను ముందుకు నడిపే పాత్రలు కావు. తమ భావోద్వేగాలు, ఆశలు, స్వప్నాలతో జీవించే నిజమైన వ్యక్తిత్వాలు. భారతీయ గ్రామీణ మహిళ జీవితంలోని అందాన్ని, ఆత్మగౌరవాన్ని, ప్రేమను ఆయన తన చిత్రాల్లో ఎంతో గౌరవంగా చూపించారు.దర్శకుడిగా మాత్రమే కాకుండా నటుడిగానూ భారతిరాజా విశేష గుర్తింపు పొందారు. వయసు పెరిగిన తర్వాత కూడా తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన ముఖంలో కనిపించే సహజత్వం, కళ్లలో ప్రతిబింబించే అనుభవం, మాటల్లో కనిపించే నిజాయితీ ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి.ఈ రోజుల్లో సాంకేతిక అద్భుతాలు, భారీ బడ్జెట్లు, విజువల్ ఎఫెక్ట్స్ సినిమాను శాసిస్తున్న తరుణంలో భారతిరాజా సినిమాలను గుర్తు చేసుకుంటే ఒక ప్రశ్న మనసులో మెదులుతుంది. నిజమైన భావోద్వేగాలు, సహజమైన కథలు, మట్టి వాసన కలిగిన పాత్రలు ఇంకా మన సినిమాల్లో ఎంతవరకు మిగిలి ఉన్నాయి? భారతిరాజా వారసత్వం మనకు గుర్తు చేసే విషయం ఇదే. సినిమా అనేది కేవలం వినోదం కాదు. అది మనుషుల జీవితాలను, వారి ఆనందాలను, బాధలను ప్రతిబింబించే కళ.భారతిరాజా మరణంతో ఒక వ్యక్తి దూరమయ్యారు. కానీ ఆయన సృష్టించిన ప్రపంచం ఎప్పటికీ మనతోనే ఉంటుంది. ఆయన సినిమాల్లో పరుగులు తీసే ప్రేమజంటలు, గాలికి ఊగే పొలాలు, వర్షంలో తడిసే కలలు, విరహంతో నిండిన చూపులు, ప్రకృతితో మమేకమైన జీవితం ... ఇవన్నీ తరతరాలకు ఆయనను గుర్తు చేస్తూనే ఉంటాయి.ఒక గొప్ప కళాకారుడు తన జీవితాన్ని ముగించుకున్నప్పుడు అతని శరీరం మాత్రమే నిశ్చలమవుతుంది. అతని సృజన మాత్రం శాశ్వతంగా జీవిస్తుంది. భారతిరాజా విషయంలో ఇది మరింత నిజం. ఎందుకంటే ఆయన కేవలం సినిమాలు తీయలేదు; జ్ఞాపకాలను సృష్టించారు. కేవలం కథలు చెప్పలేదు; భావోద్వేగాలను నాటారు. కేవలం పాత్రలను తీర్చిదిద్దలేదు; మనసులను మలిచారు.భారతిరాజా ఇక లేరు. కానీ ఆయన చూపించిన పల్లె దారులు, ఆయన కెమెరా బంధించిన ప్రకృతి అందాలు, ఆయన ఆవిష్కరించిన ప్రేమ భావనలు తరతరాల ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయి. కాలం మారినా, సాంకేతికత కొత్త పుంతలు తొక్కినా, సహజత్వానికి, మానవీయ భావోద్వేగాలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం సినీ సృజనకు ఎప్పటికీ మార్గదర్శకంగానే నిలుస్తుంది.గ్రామీణ జీవితాన్ని వెండితెరపై కవిత్వంగా మలిచిన దర్శకుడిగా, ప్రకృతిని కథలో ఒక పాత్రగా ఆవిష్కరించిన కళాకారుడిగా, ప్రేమను అత్యంత స్వచ్ఛమైన రూపంలో చిత్రించిన సృష్టికర్తగా భారతిరాజా పేరు భారతీయ చలనచిత్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది. ఆయన భౌతికంగా దూరమైనా, ఆయన సృష్టించిన దృశ్యకావ్యాలు ప్రేక్షకుల జ్ఞాపకాల్లో ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.భారతీయ సినీ రంగానికి ఆయన చేసిన సేవలకు కృతజ్ఞతాభివందనాలతో ...'భారతిరాజా గారికి వినమ్ర నివాళి.



- అమరవాజీ నాగరాజు
జర్నలిస్టు

# ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**ఉప్ప సాకలో ప్రత్యేక గ్రామసభ నిర్వహణ – అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై సమగ్ర సమీక్ష**

**బూర్గంపహాడ్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఉప్పు సాక గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభ ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణ, రహదారుల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పచ్చదనం పెంపు, సంక్షేమ పథకాల అమలు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు అందే విధానం వంటి అంశాలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. గ్రామస్థులు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి కొరత, పారిశుద్ధ్య సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యాలు, అర్హులైన వారికి సంక్షేమ పథకాల మంజూరు వంటి అంశాలపై ప్రజలు అధికారులకు వినతులు సమర్పించారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామస్థుల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ చురుకుగా పాల్గొని గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. గ్రామసభ ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం ప్రభుత్వ ప్రజా పాలన విధానానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత, వివిధ శాఖల అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా బుధవారం అన్నపురెడ్డిపల్లి మండలం అన్నపురెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మూడు దశాబ్దాల క్రితం గ్రామాల్లో సరైన రహదారులు మరుగుదొడ్లు మౌలిక వసతులు లేకపోయినా నేడు ప్రతి గ్రామంలో రహదారులు తాగునీటి సదుపాయాలు ప్రతి ఇంటికి మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. గ్రామీణాభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ప్రజల భాగస్వామ్యంతో మరింత వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి విధానాలను పాటిస్తూ వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకు నాణ్యమైన విత్తనాలు ఎరువులను వినియోగించాలని కోరారు. గత సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలిగించిన పీఆర్126 వరి రకాన్ని సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని పంటల వైవిధ్యీకరణ ద్వారా అధిక దిగుబడులు ఆదాయం సాధించవచ్చని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీలు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీల శుభ్రపరిచే పనులు ఆయిల్ బాల్స్ వినియోగం నిల్వ నీరు తొలగింపు వంటి చర్యలు చేపట్టి డెంగ్యూ మలేరియా వంటి అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని అర్హత కలిగిన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి అర్హులైన ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ప్రతిష్టాత్మకంగా ప్రీప్రైమరీ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిందని అన్నపురెడ్డిపల్లి మండలానికి మూడు ప్రీప్రైమరీ పాఠశాలలు మంజూరయ్యాయని తెలిపారు. పారదర్శకమైన ఓటరు జాబితా తయారీ కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్.ఐ.ఆర్)కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంటింటికి వచ్చే బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలు) సరైన వివరాలు అందించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ స్వర్ణ, ఎంపిడిఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబానా, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష ఇతర మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా దేవాలయం వార్షికోత్సవం

**నేలకొండపల్లి, జూన్ 10 మహా:** మండలం లోని మంగాపురంతండా లోని శ్రీ రామాలయ 15 వ వార్షికోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం లోని ఉత్సవమూర్తు విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. శ్రీరామ నామస్మరణంతో దేవాలయం మారుమోగింది. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హైద్రాబాద్ కు చెందిన శ్రీ హరిహార నాట్యాలయం వారి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటా, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహాకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి. సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి, రాజారాంపేట సోసైటీ చైర్మన్ ధీరావత్ బాలాజీ, గోబ్రియా నాయక్ , మల్లికార్జున్,తో పాటు రామాలయం కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.



# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యానికి విఘాతం

**కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్**

**బూర్గంపహాడ్, మహా** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ తీవ్రంగా ఖండించారు. బూర్గంపహాడ్ ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని, ఇది కేవలం సాంకేతిక లోపం పేరుతో తీసుకున్న నిర్ణయం కాదని భజన సతీష్ ఆరోపించారు. అఫిడవిట్‌లో కేసు ప్రస్తావన లేకపోవడాన్ని కారణంగా చూపి నామినేషన్‌ను తిరస్కరించారని, అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థికి సవరణ చేసుకునే అవకాశం కల్పించాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగానే ఆ అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న నేపథ్యంలో వాటి ప్రభావాన్ని తట్టుకోలేక రాజకీయ ప్రత్యర్థులు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుతో ప్రజల విశ్వాసాన్ని పొందుతోందని, ఆ ప్రజాదరణను అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మంద నాగరాజు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నపాటి సాంకేతిక కారణాలను చూపి నామినేషన్‌ను తిరస్కరించడం దురదృష్టకరమని, తెలంగాణ ప్రజల తరఫున బలంగా మాట్లాడగల నాయకత్వాన్ని అడ్డుకునే ప్రయత్నాలు ప్రజలు సహించరని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ గుండె వెంకన్న మాట్లాడుతూ, నామినేషన్ తిరస్కరణ ఘటన ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాల్సిన సమయంలో సవరణకు అవకాశం ఇవ్వకుండా తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ప్రజల తీర్పే అంతిమమని అన్నారు. రాజ్యసభలో తెలంగాణ తరఫున బలమైన స్వరం వినిపించే నాయకురాలిగా మీనాక్షి నటరాజన్ ఎదుగుతుండటాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే ఆమె నామినేషన్‌ను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని భజన సతీష్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ఉండాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థపై అనుమానాలు కలిగిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తుందని, ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టును ఆశ్రయించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు అన్ని రాజ్యాంగబద్ధ మార్గాల్లో పోరాడతామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించిన వారిని ప్రజలు గమనిస్తున్నారని, ఇటువంటి చర్యలకు భవిష్యత్తులో ప్రజాస్వామ్యబద్ధమైన సమాధానం తప్పదని భజన సతీష్ హెచ్చరించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, హక్కులు, అభివృద్ధి అంశాలను పార్లమెంట్‌లో బలంగా వినిపించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎడమ కంటి సుధాకర్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మల హరీష్ యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దునుకు రాము, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సింపి సాయి తదితరులు పాల్గొన్నారు.



# సాధారణ మరణాల కంటే యాక్సిడెంట్ మరణాలే ఎక్కువ

**భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**
**రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన**

**జూలూరుపాడు, మహా:** నేటి ఆధునిక యుగంలో సాధారణ మరణాల కంటే రోడ్డు ప్రమాదాల వలన సంభవించే మరణాలే ఎక్కువని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఎల్లంకి గార్డెన్స్ లో జూలూరుపాడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రోడ్డు సేఫ్టీ ప్రత్యేక గ్రామసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి సమాజంలో సాధారణ మరణాల కంటే రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలే ఎక్కువని తెలిపారు. వీటికి ప్రధాన కారణం హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ లోడ్, మద్యం సేవించి వాహనం నడపడం, రోడ్డు నియమ నిబంధనలు పాటించకపోవడమేనని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని కోరారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో గ్రామాలలోని గుంటల రోడ్లను గుర్తించడం, మరమ్మత్తులు, మూలమలుపుల వద్ద రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడం తో పాటు, గ్రామ ప్రజలకు, యువతకు రోడ్డు సేఫ్టీ నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరారు. అదే విధంగా ప్రతి గ్రామంలో గ్రామస్తుల సౌజన్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తుల్ని గుర్తించడంలో పోలీసులకు సహాయ పడడంతో పాటు గ్రామానికి సెక్యూరిటీగా ఉంటుందని తెలిపారు. గ్రామాలలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, ప్రభుత్వా నిషేధిత మత్తు పదార్థాలు సేవించిన, రవాణా చేస్తున్న వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ముఖ్యంగా పై కార్యక్రమాలన్నీ మహిళల ద్వారానే కార్యరూపం దాల్చుతాయని, కావున గ్రామ సభలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, మహిళలు నేటి నుండే తమ ఇంటి నుంచే మంచి పనికి శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. అత్యాశ వలన చాలామంది సైబర్ బాసాల బారిన పడి ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. సైబర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ మోసం జరిగిన వెంటనే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. అనంతరం రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తామని సభకు హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆదినారాయణ, సీఐ శ్రీలక్ష్మి, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై బి రవి, ఆర్టిఓ వెంకటరమణ, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రవి, ఎఫ్ఆర్ఓ తేజస్వి, డాక్టర్ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్, మహిళా సబ్ ఇన్స్పెక్టర్లు రమాదేవి, అరుణ, మనీషా, రమాదేవి తోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, మధుసూదన రావు, గిరిబాబు, సుమంత్, వివిధ గ్రామపంచాయతీల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తోపాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







# కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

- **పెంచిన ఇంధన గ్యాస్ ధరలతో పేదోడి నడ్డివిరుస్తున్న కేంద్ర సర్కార్**
- **సామాన్యులపై అదనపు భారాలు మోపడం దుర్మార్గం**
- **పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాల ఉధృతిని కొనసాగిస్తాం**
- **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**భద్రాద్రి బ్యూరో, మహా:** కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కేంద్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి వర్గాల పొట్టకొడుతుందని ప్రజలపక్షాన ఉద్యమాల ఉధృతిని పెంచి పాలకులకు కళ్ళు తెరిపిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పెంచిన ఇంధన నిత్యావసరాల ధరలను తగ్గించి పేదలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం సామాన్య ప్రజలపై అదనపు భారాలు మోపడం దుర్మార్గమన్నారు. పెంచిన ఇంధన గ్యాస్ ధరలతో పేదోడి నడ్డివిరుస్తున్న కేంద్ర సర్కార్ ధనవంతులకు ఊడిగం చేస్తూ దేశ సంపదను దోచిపెడుతోందని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రానికి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. పేద మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతున్న పాలకుల తీరుపై రాజీలేని పోరాటాలు చేస్తామని తక్షణమే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ప్రతిఘటన ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, సరెడ్డి పుల్లారెడ్డి, కె.సారయ్య, మున్నా లక్ష్మి కుమారి, చంద్ర నరేంద్ర కుమార్, వి.పూర్ణచందర్ రావు, వీరాస్వామి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, మువ్వా వెంకటేశ్వర్ రావు, భూక్యా దస్రు, యు.రాహుల్, ఎస్ కె ఫహీమ్, మండలాల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# తుమ్మల వాగులో వ్యర్థాల కుప్పలు

- **దుర్గంధం వెదజల్లుతున్న వైనం**
- **వ్యర్థాలను తొలగించాలని కోరుతున్న ప్రజలు**



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం, బేతాళపాడు మార్గమధ్యంలోని తుమ్మల వాగు లెవెల్ బ్రిడ్జి వద్ద వ్యర్థాల కుప్పలు, తెప్పలుగా పేరుకుపోయాయి. దీనివలన వాగు నీరు కలుషితం అవుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తిని అనారోగ్యం బారిన పడుతున్నాయని, పర్యావరణం కలుషితం అవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఏ కార్యక్రమాలు జరిగినా ఇస్తర్లు తదితర వ్యర్థాల తోపాటు, కోళ్లు వ్యర్థాలను వాగులో పడేయడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు. దీనివలన అటువైపుగా వెళ్లే ప్రయాణికులు, ప్రజలు, రైతులు ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లి నానా అవస్థలు పడుతున్నారు. దీనివలన అంటువ్యాధులు ప్రబలే అవకాశం పొంచి ఉందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి వ్యర్థాలను తొలగించి మరల ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం ప్రబలే సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని గ్రామస్తులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా అవగాహన కల్పించాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఎవరైనా ఇష్టం వచ్చినట్లు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడేసినట్లు నిర్ధారణ అయితే వారిపై తగు చర్యలు తీసుకొని, జరిమానా విధించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**లేదంటే ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం**
**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్**



**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రధానమైన సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్ అన్నారు. కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ డివిజన్లో మున్సిపల్ కార్యాలయం ముందు బుధవారం ప్రధానమైన సమస్యల పరిష్కారం కోరుతూ వనమా రాఘవేందర్, కిలారు నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ ఆధ్వర్యంలో మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్వంచలో త్రాగునీరు రోడ్లు డ్రైన్లు వీధి దీపాలు శానిటైసింగ్ ఇతర ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వనమా రాఘవేంద్రరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అనే నినాదంతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక ప్రజలను ప్రజా సమస్యలను తుంగలోకి తొక్కి కనీస వసతులు కల్పించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. ప్రజలకు కనీస అవసరాలు అయినటువంటి త్రాగునీరు రోడ్లు డ్రైన్లు వీధి దీపాలు శానిటైజింగ్ ఇతర చిన్న సమస్యలను కూడా తీర్చలేక పోతున్నారని మండిపడ్డారు.

సమస్య చెప్పుకుందాం అంటే అధికారులు అందుబాటులో ఉండే పరిస్థితి కూడా లేదని అసహనం వ్యక్తం చేశారు. గతంలో కొత్తగూడెం పాల్వంచ మున్సిపాలిటీగా ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ ప్రభుత్వ హాయంలో పట్టణ గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా శరవేగంగా అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. తాగునీరు 24 గంటల కరెంటు సరఫరా చేశారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేసి క్షణమే పరిష్కరించే వారిని అన్నారు. అంతేకాకుండా బిఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్తగూడెం నియోజకవర్గంలో ఆనాడు బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులుగా ఉన్నటువంటి వనమా వెంకటేశ్వరరావు కొత్తగూడెం మున్సిపాలిటీకి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ప్రజలకు కనీస వసతులను కల్పించారని ప్రజా సమస్యలను తీర్చారని గుర్తు చేశారు. ఇప్పుడు కార్పొరేషన్ అయినప్పటికీ కూడా ప్రజా సమస్యలను పట్టించుకునే వారు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ల వారీగా కార్పొరేటర్లు ఉన్నప్పటికీ వారితో చెప్పుకున్నా కూడా సమస్యలు పరిష్కారం కావట్లేదని ప్రజలు వాపోతున్నారని పేర్కొన్నారు. ఎందుకంటే కార్పొరేటర్లు సమస్యలు పరిష్కరించాలన్నా కూడా వారికి కనీస నిధులు కేటాయించట్లేదని ఈ కాంగ్రెస్ ప్రభుత్వ పేరుకే కార్పొరేషన్ చేసిందని డివిజన్ల వారీగా తక్షణమే నిధులు కేటాయించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుందని అన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పాల్వంచ మండల అధ్యక్షులు మల్లెల శ్రీరామ్ మూర్తి,(39)వ డివిజన్ కార్పొరేటర్ గోవాడ గుణచరిత్, దాసరి నాగేశ్వరరావు, కాల్వ ప్రకాష్, బీఆర్ఎస్ పార్టీ పాత పాల్వంచ ఇన్చార్జ్ ముత్యాల ప్రవీణ్, కుంచెర్ల రామకృష్ణ (ఆర్కె), బీఆర్ఎస్వి పాల్వంచ పట్టణ అధ్యక్షులు జూపెల్లి దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, పత్తిపాటి శీను, రంజిత్, చింతలచెరువు దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, యాదయ్య, వాసుమల్ల గౌతం, డి ఆర్ కె, కుంపటి శివ, కంచర్ల రామారావు, అనంత్, కిలారు చిన్న, ్టెటికోట సుధాకర్, తెలంగాణ సురేష్, బండి అచ్చమ్మ, విజయ, లక్ష్మి, కృష్ణవేణి, సావిత్రి, జోష్ణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## గడపగడపకు ఉపాధ్యాయులు

**ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ బోధన**

**నేలకొండపల్లి, జూన్ 10 మహా :** ప్రభుత్వ పాఠశాలలో అత్యు త్తమ బోధన జరుగుతుందని ప్రధాన ఉపాధ్యాయుడు ఆనంద్ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం బడిబాట కార్యక్రమం ను నిర్వహించారు. గడపగడపకు విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మీ పిల్లల చదువు మా బాధ్యత ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అం దిస్తున్నామని అన్నారు. ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు... ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారని అన్నారు. మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్య పుస్తకా లు, ఏకరూప దుస్తులు అనేక కార్యక్రమాలు అందిస్తు న్నట్లు తెలిపారు. ప్రవేట్ మోజులో పడి విద్యార్థుల జీవి తాలను నాశనం చేయవద్దని సూచించారు.



# ఆర్.ఎం.పి వైద్యుల సంఘం నుండి తాటికొండ రవికుమార్ బహిష్కరణ

- **మందమర్రి పట్టణ ఆర్.ఎం.పి, పి.ఎం.పి అనుభవ వైద్యుల సంఘం**

**మందమర్రి, మహా :** మందమర్రి పట్టణ ఆర్.ఎం.పి, పి.ఎం.పి అనుభవ వైద్యుల సంఘం నుండి తాటికొండ రవికుమార్ అనే వ్యక్తిని బహిష్కరిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదాసు శంకరయ్య, మందమర్రి పట్టణ అధ్యక్షులు గోనే గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి అడ్డూరి సాంబమూర్తిలు తెలిపారు. గత కొంతకాలంగా మా సంఘానికి చెందిన సభ్యుడు తాటికొండ రవికుమార్ సంఘం యొక్క క్రమశిక్షణా నియమావళిని ఉల్లంఘించి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులను,పట్టణ కార్యవర్గ సభ్యులను అసభ్యకరమైన, అవమానకరమైన పదజాలంతో దూషించడం ద్వారా సంఘ ప్రతిష్ఠకు భంగం కలిగించినందున, సంఘ కార్యవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు ఆయనను మందమర్రి పట్టణ ఆర్.ఎం.పి, పి.ఎం.పి అనుభవ వైద్యుల సంఘం శాశ్వత సభ్యత్వం నుండి, సంఘం నుండి శాశ్వతంగా బహిష్కరిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఇతడు గత కొంతకాలంగా సంఘ సభ్యులపై వ్యతిరేక ప్రచారం చేస్తున్న దృశ్యం పట్టణ సంఘ సభ్యులం మూకుమ్మడిగా సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వెల్లడించారు. ఇకపై ఆయనకు సంఘంతో ఎటువంటి సంబంధం లేదని, సంఘం తరపున మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. మళ్లీ సోషల్ మీడియాలో కానీ ఇతర సంఘ సభ్యులతో కానీ అమర్యాదగా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కట్ల శ్రీనివాస్, చింతల పోషం, గాజుల శంకర్, ఏ లక్షణ్, బి జనార్ధన్, తిప్పని శ్రీనివాస్, ఎండి మతీన్ ఖాన్,ఎస్. ఏ ఖాన్, గోనె సత్యం, గందం శ్రీనివాస్, కుక్కల శ్రీనివాస్, అరె రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# హరిత బెల్లంపల్లి నిర్మాణానికి అందరూ కృషి చేయాలి

**మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్**

**బెల్లంపల్లి, మహా:** హరిత బెల్లంపల్లి నిర్మాణానికి పట్టణ ప్రజలందరూ కృషి చేయాలని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం నాడు ప్రజాపాలన - 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 02,03,04,09,12,14,16,20,23 వార్డులలో వార్డు సభలు నిర్వహించారు.కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ సంబంధిత వార్డుల కౌన్సిలర్లు మరియు ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని, ప్రతి ఇంటిలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి చెత్త, పొడి చెత్త, పారిశుధ్య చెత్త మరియు హానికారక చెత్తగా నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు. రోడ్లపై, ఖాళీ స్థలాల్లో లేదా మురుగు కాలువల్లో చెత్త వేయరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం అధికంగా ఉన్న నేపథ్యంలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు మరియు ఇతర ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని కోరారు. ఒకసారి ఉపయోగించి పారవేసే ప్లాస్టిక్ పదార్థాలు పూర్తిగా కుళ్లిపోవడానికి సుమారు 400 నుండి 500 సంవత్సరాలు పడుతాయని వివరించారు.బెల్లంపల్లి మున్సిపాలిటీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత మరియు ప్రజా భద్రత విషయంలో ప్రజల సహకారంతో పరిశుభ్రమైన, హరిత బెల్లంపల్లి నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# నిరుద్యోగులు జర్మనీ భాష నేర్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు

- **రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**మందమర్రి / మంచిర్యాల మహా :** చదువుకున్న నిరుద్యోగులు జర్మనీ భాష నేర్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద వెల్లడించారు. బుధవారం మందమర్రి సింగరేణి ఇల్లందు క్లబ్ లో టాస్క్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ శిబిరం ప్రారంభోత్సవానికి
జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, మండల తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు, జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, టామ్ కామ్ మేనేజర్ నాగభారతి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న నిరుద్యోగులు శ్రద్ధగా జర్మన్ భాష నేర్చుకొని ఉపాధి పొందాలని ఆయన సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జర్మనీలో నర్సింగ్, సాంకేతిక, పారిశ్రామిక రంగాలలో లక్షలాది ఉద్యోగాలలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అక్కడ ఉద్యోగాలు పొందేందుకు తెలంగాణ యువతకు రాష్ట్ర ప్రభుత్వం టాస్క్ ద్వారా జర్మన్ భాషా శిక్షణ అందిస్తుందని తెలిపారు. ఉద్యోగం ఎక్కడ లభిస్తే అక్కడికి వెళ్లి పని చేసే దృక్పథం యువతలో ఉండాలని సూచించారు. తాను పారిశ్రామికవేత్తగా పని చేసిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ మార్కెట్ ఉన్న ప్రాంతాలలో పరిశ్రమలు స్థాపించడం వల్ల వేలాది మందికి ఉపాధి కల్పించగలిగామని అన్నారు.స్థానికతకే పరిమితం కాకుండా అవకాశాలను వెతుక్కుంటూ ముందుకు వెళ్లాలని యువతకు సూచించారు. జర్మనీలో వారానికి కేవలం 32 నుండి 35 గంటలు మాత్రమే విధులు నిర్వహించాలని చెప్పారు.జర్మనీలో ఉద్యోగం చేసే వారికి నెలకు 2 లక్షల 50 వేల రూపాయలు, ఆపైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ ఏజెన్సీల మోసాలకు గురి కాకుండా ప్రభుత్వ సంస్థ అయిన టాస్క్ ద్వారా శిక్షణ పొంది విదేశీ ఉద్యోగాలను పొందాలని చెప్పారు. ఇప్పటికే ఈ కార్యక్రమానికి 112 మంది యువత నమోదు చేసుకున్నారని, వారందరికీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం బాధ్యతగా తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం టామ్ కామ్ సంస్థకు 90 కోట్ల రూపాయలు అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు 2 వేల రూపాయల స్టైఫండ్ అందిస్తోందని, అదే విధంగా జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న అభ్యర్థులలో 80 శాతం హాజరు నమోదు చేసుకున్న వారికి కాకా వెంకటస్వామి ట్రస్ట్ తరఫున అదనంగా నెలకు 1 వేయి రూపాయల స్టైఫండ్ అందిస్తామని తెలిపారు. యువతలో క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్య సాధనపై దృష్టి ఉండాలని, జర్మన్ భాషను నేర్చుకోవడానికి ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. జర్మనీలో ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో శిక్షణ పొందితే తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. మందమర్రిలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపేందుకు ప్రతి వారం తాను స్వయంగా శిక్షణ కేంద్రాన్ని సందర్శించి అభ్యర్థులతో కలిసి జర్మన్ భాషను నేర్చుకుంటానని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. అంతకుముందు క్లబ్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జర్మన్ భాషా శిక్షణలో బీటూ సర్టిఫికేషన్ పూర్తి చేసిన మరియన్ పాసల్, హుబా ఫాతిమా లకు ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.







# గంజాయి , మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- **మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలి**
- **డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత**
- **యువతకు డీజీపీ సందేశం**
- **తోషం గ్రామ సభకు హాజరు**



**ఆదిలాబాద్ మహా:** గంజాయి నిర్మూలన రోడ్డు భద్రతపై ప్రజలు తగిన అవగాహన కలిగిఉండాలని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. బుధవారం గుడి హత్నూర్ మండలం తోషంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం గ్రామ పెద్దలు, గ్రామస్తులు డీజీపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల సమస్యలను డీజీపీ అడిగి తెలుసుకున్నారు. యువత గంజాయి ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. యువత విద్య, క్రీడలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ సందర్భంగా 30 మంది ఆటో డ్రైవర్లకు ప్రమాద సమయంలో ఉపయోగపడే ప్రథమ చికిత్స కిట్లను పంపిణీ చేశారు. ప్రమాదాల సమయంలో రక్తస్రావాన్ని నియంత్రించి ప్రాణాలను కాపాడడంలో ఈ కిట్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఆదివాసి యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ తోషం, తోషం తాండా, రాగాపూర్, బోర్రమద్ది, పూనగూడ, తోయిగూడ గ్రామాలకు చెందిన యువకులకు ఐదు వాలీబాల్ కిట్లను అందజేశారు. హెల్మెట్ ప్రాధాన్యతను వివరించి.గ్రామ సభలో పాల్గొన్న సుమారు 200 మంది ప్రజలకు హెల్మెట్లను పంపిణీ చేసారు. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అలాగే కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు.అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో పాల్గొన్న 75 మంది యువతకు లర్నింగ్ లైసెన్సులను అందజేశారు. ప్రతి వాహనదారుడు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అలాగే గతంలో లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులకు ఇళ్ల పట్టాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మల్టీ జోన్1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి , జిల్లా కలెక్టర్ రాజర్షి షా , జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ , అదనపు ఎస్పీ పి. మౌనిక , ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి , గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి

**బెల్లంపల్లి వన్టౌన్ సిఐ శ్రీనివాసరావు**



**బెల్లంపల్లి, మహా:** రోడ్డు భద్రత నియమాలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు బుధవారం నాడు తెలంగాణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పట్టణంలోని 2వ వార్డు కౌన్సిలర్ నిచ్చకోల వంశీకృష్ణ అధ్యక్షతన తిలక్ స్టేడియం క్లబ్ లో వార్డు సభ నిర్వహించడం జరిగింది.కార్యక్రమానికి బెల్లంపల్లి 1 టౌన్ సీఐ శ్రీనివాస రావు సిబ్బందితో కలిసి హాజరయ్యారు. అనంతరం సీఐ శ్రీనివాస రావు ప్రజలు, యువత ను ఉద్దేశించి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపరాదు అని,మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, అతివేగం, సెల్ఫోన్ డ్రైవింగ్ ప్రాణాంతకం అని తెలిపారు. వాహనాలకు RC, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి అని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ,నేరాలు & దొంగతనాల నివారణ నకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లేటప్పుడు పక్కింటి వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి అని,అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వారి గురించి వెంటనే డయల్ 100లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, బ్యాంకు నుండి డబ్బులు తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి అని,ఆన్‌లైన్ మోసాలు, ఓటిపీ మోసాలు, ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి అని,బంగారు ఆభరణాలు ధరించి ఒంటరిగా తిరగవద్దని మహిళలకు సూచించారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు, కాలనీ వాసులకు సూచించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువు, ఉపాధి, క్రీడలపై దృష్టి పెట్టాలని, సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలి, తప్పుడు వార్తలు షేర్ చేయవద్దు అని,శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నివారణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి 1 టౌన్ పోలీస్ సిబ్బంది, 2వ వార్డు ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నూతన డీఎంహెవో డాక్టర్ సాధన

**ఆదిలాబాద్ మహా:** నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణిగా డా.పి.సాధన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ, వైద్య శాఖ కార్యకలాపాలు, రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా తన వంతు కృషి చేస్తూ, సమర్థవంతంగా విధులను నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి మనోహర్, డా.నరేందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

**మధ్యాహ్న భోజనం రాష్ట్ర అధ్యక్షురాలు యెలమోని స్వప్న**

**ఇబ్రహీంపట్నం జూన్ 10 మహా:** అక్రమ అరెస్టులతో ప్రజా సమస్యల పరిష్కరించలేరని మధ్యాహ్న భోజనం రాష్ట్ర అధ్యక్షురాలు యల్లమాని చోప్రా అన్నారు. బుధవారం కందుకూరు మండలం, మీర్ ఖాన్ పేట గ్రామంలో గురుకుల ప్రోగ్రాంకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడంతో, మధ్యాహ్న భోజనం రాష్ట్ర అధ్యక్షురాలు వై స్వప్న, రంగారెడ్డి జిల్లా సభ్యులు జై శిరీష సిహెచ్ సరితను అక్రమంగా పోలీసులు ఇంటి దగ్గరికి వచ్చి అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎలమొని స్వప్న మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో అనేక మంది మధ్యాహ్నం భోజనం కార్మికులు 30 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనంతో ప్రతిరోజు పాఠశాలలో వంట వడ్డిస్తున్నారు. కానీ మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు మాత్రమే రేవంత్ రెడ్డికి మాత్రం పట్టడం లేదు, ఒకవైపు అక్షయపాత్ర తీసుకొస్తూ ఉన్నాడు. కానీ మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదు, ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమస్యలు పట్టించుకోలేక పోతే, తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ తిరిగినా అక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.

# విద్య ప్రతి ఒక్కరి హక్కు సర్కార్ పాఠశాలలోనే నాణ్యమైన విద్య...

- **జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్**
- **రాయపోల్ ప్రభుత్వ పాఠశాల 'బడిబాట'..**
- **ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల చేరికకు ప్రత్యేక డ్రైవ్**



**ఇబ్రహీంపట్నం జూన్ 10 మహా:** విద్య ప్రతి ఒక్కరి హక్కు అని, సర్కార్ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పెంచడమే లక్ష్యంగా 'బడిబాట' కార్యక్రమాన్ని, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, రాయపోల్ గ్రామంలో... జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ... బాల బాలికకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం 'బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. పాఠశాల వయస్సు గల పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ విద్య వంటి అనేక సౌకర్యాలను అందిస్తున్నాయని వివరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం నుండి తమ పాఠశాలలో ప్రీ ప్రైమరీ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు కూడా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అయినప్పటికీ వివిధ కారణాల వల్ల కొంతమంది పిల్లలు పాఠశాలకు దూరమవుతున్నారని, 'బడిబాట' కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నారు. విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెరగడం వల్ల విద్యా ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని అన్నారు. ప్రతి చిన్నారి పాఠశాలలో చేరి విద్యను అభ్యసించడం ద్వారా వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని పేర్కొన్నారు. "మన ఊరు మన బడి ప్రతి చిన్నారి బడికి" అనే లక్ష్యంతో అందరూ కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలని కోరారు. బడిబాట కార్యక్రమం విజయవంతం కావడం ద్వారా విద్యావంతమైన సమాజ నిర్మాణం అయన సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి.!

- **21వ వార్డు కౌన్సిలర్ చిలకల బుగ్గరాములు**
- **వర్షా కాలంలో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి**

**ఇబ్రహీంపట్నం జూన్ 10 మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 21వ వార్డులో వార్డు సభ నిర్వహించడం జరిగింది. బుధవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 21 వ వార్డు కుమ్మరి కుంట కాలనీలో చాకలి ఐలమ్మ విగ్రహం దగ్గర, మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు సభ కార్యక్రమానికి, ముఖ్యఅతిథిగా వార్డు కౌన్సిలర్ చిలకల బుగ్గరాములు హాజరై, సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను అధికారులకు అందించి త్వరగా పరిష్కరించాలని వారికి సూచించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ బుగ్గ రాములు మాట్లాడుతూ... వార్డు అభివృద్ధి, పరిశుభ్రత, రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు, తాగునీటి సరఫరా, వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు, డ్రైనేజీ నిర్వహణపై దృష్టి సారించాలని, మున్సిపల్ అధికారులకు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో వర్షాల కారణంగా విష జ్వరాలు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అట్లాగే వార్డ్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిలుకల తరుణ్, బి.రాజు, మేకల రాజు కుమార్, వంగపల్లి గణేష్, యంజాల లక్ష్మయ్య, ముదిగొండ అజయ్, మున్సిపల్ అధికారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



మహా పత్రిక 07
ANN తెలుగు
గురువారం, హైదరాబాద్ | 11-06-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM




# టీజీ సీపీజీఈటి 2026-27 సంవత్సర దరఖాస్తు తేదీని పొడిగించాలి

- **కేయూ రిజిస్ట్రార్ కు వినతి పత్రం అందజేసిన స్వేరో స్టూడెంట్స్ యూనియన్**

**హన్మకొండ మహా;** స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సీపీజీఈటి 2026 27 వ సంవత్సరం దరఖాస్తు బుధవారం ముగియనున్నది. ఎంతోమంది బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులు ఆర్థిక వెసులుబాటు కాక చాలామంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేకపోవడం జరిగిందని తెలిపారు. అందుచేత తేదీని తక్షణమే పొడిగించి విద్యార్థులకు న్యాయం చేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం కు వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు.



# నిబంధనలు పాటిసేనే లేఔట్లకు అనుమతులు

- **ప్రణాళికా బద్ధంగా లేఔట్ల అభివృద్ధి పనులు చేపట్టాలి**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ కార్పొరేషన్ మహా ;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో లేఔట్ అప్రూవల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద , హన్మకొండ జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ మునిసిపల్ కమిషనర్ చాహత్ బాజ్పాయ్ పాల్గొని జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రతిపాదిత లేఔట్లు, అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులు, మౌలిక సదుపాయాల కల్పన, నిబంధనల అమలు తదితర అంశాల పై కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. లేఔట్ల అభివృద్ధి పనులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అదే విధంగా ప్రణాళికా బద్ధంగా లేఔట్ల అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, కూడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, సిటీ ప్లానర్ రవీంద్రారెడేకర్, ఇరిగేషన్ , పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఏ డి ల్యాండ్ సర్వే అధికారి, డిటిసిపిఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పార్టీని వీడిన వారిని
# పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదు

- **ఉద్యమ నేత, భారాస నాయకులు నీలం రాజు కిషోర్**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పార్టీ పై, అలాగే వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పై కొందరు వ్యక్తిగత విమర్శలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపు కుంటున్నారు. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గం లోని 12, 13, 20, 21, 22, 23 డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పార్టీ మారుతున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఉద్యమ నేత, భారాస సీనియర్ నాయకులు నీలం రాజు కిషోర్ తో పాటు బీఆర్ఎస్ పార్టీ 6 డివిజన్ ఇంచార్జ్, లుగా మేము తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నీలం రాజు కిషోర్ మాట్లాడుతూ కొంతమంది పనికట్టుకొని చేస్తున్న ఈ ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. రంగులు మార్చే ఊసరవెల్లిలా వారి స్వలాభాల కోసం పార్టీలు మారే ఈ అవకాశ వాదులు ఇటీవల 2023 ఎన్నికల అనంతరం పార్టీని వీడి వెళ్లిన కొందరు తాజా మాజీ కార్పొరేటర్లు తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం గత కొంతకాలంగా మాకు అందుతోంది. అయితే పార్టీని కష్టకాలంలో వీడి వెళ్లిన వారిని తిరిగి పార్టీలో చేర్చుకోవడం పై తూర్పు నియోజకవర్గ కార్యకర్తలు సుముఖంగా లేరని స్పష్టం చేస్తూ పార్టీని నమ్ముకుని కష్టకాలంలోనూ జెండాను మోసిన కార్యకర్తల మనోభావాలను పార్టీ నాయకత్వం గౌరవించాలని ఈ సందర్భంగా కోరుతున్నాము.అదే విధంగా ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న ఏ ఒక్క నాయకుడు గానీ, కార్యకర్త గానీ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని,



ఇలాంటి తప్పుడు ప్రచారాల ద్వారా కార్యకర్తల్లో గందరగోళం సృష్టించే కుటీల రాజకీయ ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. మీకు దమ్ముంటే ఏ డివిజన్ నుండి ఏ కార్యకర్త పార్టీలో ఏ పదవిలో ఉన్నాడో పేరు చెప్పి ఇదే పత్రిక సమావేశం నిర్వహించి తెలియజేయాలని బిఆర్ఎస్ పార్టీ తరపున మేం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మీరు కాంగ్రెస్ పార్టీలో చేరాక మీతో చేరిన అనంతరం వారి వివరాలు ఇదే విధంగా పత్రికా సమావేశం నిర్వహించి మేము మరల తెలియజేస్తామని చెప్పారు. నమ్ముకున్న ప్రజలను గానీ, భారాస పార్టీలో పదవులు, అవకాశాలు పొందిన తర్వాత పార్టీని వీడడం గానీ మా నాయకుడు నన్నపునేని నరేందర్ మీలాగా చేయలేదని అయినా ఆయనను వ్యక్తిగతంగా విమర్శించడం, అసత్య ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని ఇటువంటి దుష్ప్రచారాలను కార్యకర్తలు సహించరని తేల్చి చెప్పారు. కొంతమంది తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం, మరి కొంతమంది పదవిని అడ్డుపెట్టుకొని భూ దందాలు సెటిల్మెంట్లు, ముఖ్యంగా వారి వ్యక్తిగత వ్యాపారాలతో ప్రజలను మోసం చేసి కేసులకు భయపడేవారు, అలాగే అధికార పార్టీలో ఉంటేనే అభివృద్ధి పనులు వేగంగా జరిగి పర్సంటేజీలు వస్తాయని అభిప్రాయ పడేవారు మరికొందరు ఇలాంటి వారందరూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరే కార్పొరేటర్ల కు నాయకులకు ప్రజాస్వామ్యానికి, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే వీరందరికీ రాజకీయంగానూ, ప్రజాస్వామ్య బద్ధంగానూ తగిన సమాధానం త్వరలోనే ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 12, 13, 20, 22, 23 డివిజన్ల ఇన్‌చార్జిలు రాంకీ, సయ్యద్ అహ్మద్, మహ్మద్ ఇక్బాల్, చుంచు వంశీ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలకుర్తి గ్రామంలో పరిశుభ్రత పనులు వేగవంతం

**స్మశాన వాటిక శుభ్రపరిచిన గ్రామపంచాయతీ – డంపింగ్ యార్డ్ తవ్వకం ప్రారంభం**

**పాలకుర్తి మహా** జూన్ 10 పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామంలో గ్రామ పరిశుభ్రత, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆధ్వర్యంలో స్మశాన వాటిక వద్ద ప్రత్యేక శుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఉప సర్పంచ్ వైద బుగ్గ రామస్వామి మరియు పాలకవర్గ సభ్యుల రావుల మనోహర్, కుమార్ , సంతోష్ పద్మ మురళి సహకారంతో జేసీబీ సహాయంతో ముళ్ల పొదలు, పిచ్చి చెట్లను తొలగించారు.

అదేవిధంగా గ్రామంలో వ్యర్థాల నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంతో డంపింగ్ యార్డ్ తవ్వకం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ పరిసరాలు మరింత పరిశుభ్రంగా మారడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయని గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు.

గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత మరియు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని సర్పంచ్ పెద్దపల్లి తిరుమల తెలిపారు.



# నేత్రదాత కొయ్యడ కొమురమ్మ సంస్మరణ సభ

**పాలకుర్తి, మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం అందుగులపల్లి గ్రామానికి చెందిన నేత్రదాత కీ.శే. కొయ్యడ కొమురమ్మ సంస్మరణ సభను వారి కుటుంబ సభ్యులు మరియు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీసీ జిల్లా కార్యదర్శి సుర సమ్మయ్య , సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డా. మేరుగు భీష్మాచారి , పాలకుర్తి మండల అధ్యక్షులు పృథ్వీరాజ్ హాజరయ్యారు. సభలో నేత్ర, అవయవ, శరీర దానాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమాజ సేవలో భాగంగా అవయవ దానాల ద్వారా మరెందరికో జీవన వెలుగులు అందించవచ్చని వక్తలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ తరపున జ్ఞాపికను డీసీసీ జిల్లా కార్యదర్శి సుర సమ్మయ్య చేతుల మీదుగా కొమురమ్మ భర్త కొయ్యడ ఓదెలు అందజేసి సత్కరించారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఫౌండేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొని కొమురమ్మ ఘన నివాళులు అర్పించారు.

# అవగాహన తోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యం

- **ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్**
- **అలరించిన జాగృతి సాంస్కృతిక కార్యక్రమాలు**



**హన్మకొండ మహా;** రోడ్డు భద్రతా నియమాల పై అవగాహన, ప్రజల భాగస్వామ్యం తోనే రోడ్డు ప్రమాదాలను నియంత్రించ గలమని డిజిపి అనిల్ కుమార్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణలో భాగం వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని మాంగళ్య కల్యాణ వేదికలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్ తో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పాల్గొన్నారు. ముందుగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజలు, యువత ఉద్దేశిస్తూ డిజిపి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గతం లో 1లక్ష73 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, దీని కారణంగా దేశ జీడీపీ 3శాతం నష్టం జరుగుతోందని. తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది 7వేలకు పై ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో మరణించారని. దీని కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఎన్ని భారీ ప్రమాదాలు జరిగిన ప్రజల్లో మార్పు రావడం లేదని, విదేశాల్లో ట్రాఫిక్ రూల్స్ అతి కఠినంగా ఉంటాయని అక్కడ ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే వేలల్లో జరిమానాలు విధించబడతాయని, కానీ మనదేశంలో మాత్రం ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే తక్కువ గా జరిమానాలు విధించడం ద్వారా వాహనదారులకు భయం ఉండటం లేదని, మన దేశంలో రోడ్డు ప్రమాదాలకు ఇది కూడా ఒక కారణమని, ట్రాఫిక్ నిబంధనలు మీ భద్రత కోసమని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎన్నో రోడ్డు ప్రమాదాలను నివారించగలమని, అదే అరైవ్ అలైవ్ ముఖ్య ఉద్దేశం అని ప్రతి వాహన దారుడు స్వీయ రక్ష పాటిస్తూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని, గత ఆరు నెలలుగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా వరంగల్ కమిషనరేట్ పరిధిలో 15 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గు ముఖం పట్టాయని, ప్రతి ఒక్కరూ కూడా తమ వంతు బాధ్యతగా భావిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదలను నివారించగలమని డీజీపీ తెలిపారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంవత్సరంలో తొమ్మిది వందల హత్య జరుగుచుండగా, రోడ్డు ప్రమాదాల్లో మాత్రం ప్రతి సంవత్సరం సుమారు 8వేల మందికి పైగా మరణిస్తున్నారని ఇది ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన విషయమని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనం నడపటం ద్వారా ఈ సమస్య పరిష్కరించు కోగలమని తెలిపారు.అంతకు ముందు కార్యక్రమం జరిగే ఆవరణలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించి ప్రమాదానికి గురైన వాహనాలను ప్రదర్శనకు ఉంచి ప్రమాదం జరిగిన తీరును అధికారులు డిజిపికి క్షుణ్ణంగా వివరించారు, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే జరిగే పరిణామాల పై జాగృతి కళాబృందం, ట్రాఫిక్ పోలీసులు అవగాహన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆలోచింపచేసాయి. అనంతరం డీజీపీ చేతుల మీదుగా డ్రైవింగ్ లో ప్రతిభ కనబరిచిన పోలీస్, ఆర్టీసీ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలను అందజేయగా, యువతకు హెల్మెట్లు, ఆటో డ్రైవర్లకు కంటి అద్దాలను అందజేశారు. చివరగా ట్రాఫిక్ నిబందనలు పాటిస్తామని డ్రైవర్ల తోపాటు స్థానిక యువతతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డిసిపిలు రాజమహేంద్ర నాయక్, అంకిత్ కుమార్, ధార కవిత, అదనపుడిసిపి ప్రభాకర్ రావు, ఏసీపీలు భీమ్ శర్మ, నర్సయ్య, సత్యనారాయణ తో పాటు వెస్ట్ జోన్, ట్రాఫిక్ కు చెందిన ఇన్స్ స్పెక్టర్లు, ఎస్. ఐ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీ రికార్డ్ పాలనతో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు..

**రాజేంద్రనగర్ మహా ;** భారత ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోదీ 4,399 రోజులు నిరంతరాయంగా పదవిలో కొనసాగి, దేశ చరిత్రలో ఎన్నికైన ప్రధానులలో అత్యధిక కాలం ప్రజలకు సేవలను అందించిన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించి, సందర్భంగా డివిజన్ అధ్యక్షులు సూర్రెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులతో కలిసి సంబరాల్లో భాగంగా అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను బిజెపి నాయకులకు అందజేశారు.

మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలన దేశ చరిత్రలో స్వర్ణ అక్షరాలతో లిఖించబడే యుగంగా నిలిచిపోతుందన్నారు. వికసిత్ భారత 2047 లక్ష్యసాధనకు ప్రతి బిజెపి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు జోగు రవి,అడికే రాజు,అడికే మహేందర్, బల్ల శ్రీనివాస్ యాదవ్, గూడూరి అంజి, శ్రీనివాస్, వినయ్, నిఖిల్, శ్రీనివాస్, రాఘవేందర్ రెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఈవీఎంల భద్రత విషయంలో అలసత్వం తగదు.!

- **రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు**
- **ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌ను తనిఖీ**
- **భద్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి..**




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) గోడౌన్‌ను రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి గోడౌన్ లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు (BUలు), కంట్రోల్ యూనిట్లు (CUలు), వీవీప్యాట్ యంత్రాలు (VVPATలు) మరియు ఎన్నికల సామగ్రి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎంల నిర్వహణ, భద్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత, సంరక్షణ, నిర్వహణలో నిర్దేశిత విధానాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. తదనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించి, వారి సమక్షంలోనే గోడౌన్‌కు సీల్ వేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహసీల్దార్, ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి శ్రీ బొమ్మ రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కబ్జా కోరల్లో హిమాయత్ సాగర్ జలాశయం..

**రాజేంద్రనగర్ మహా ;** కబ్జా కోరల్లో జంట జలాశ్యమైన హిమాయత్ సాగర్ ను సైతం వదలని అక్రమార్కులు. శంషాద్ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు రావడంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ప్రభుత్వ భూములైన, జంట జలాశయ భూములైన, ప్రైవేటు భూములైన జాంతానయా అంటూ ఆక్రమించేస్తున్నారు. అక్రమార్కులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో జలమండలి, రెవెన్యూ అధికారులు సైతం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శంషాబాద్ పరిధిలోని కోత్వాల్ గూడ రెవెన్యూకు ఆనుకొని హిమాయత్ సాగర్ చెరువు విస్తరణ 85 చదరపు కిలోమీటర్లు, కోత్వాల్ గూడలోని కొన్ని సర్వే నెంబర్లతో పాటు పలు గ్రామాలకు చెందిన సర్వే నంబర్లు చెరువు భూములు విస్తరించి ఉన్నాయి. శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రాజెక్టులు ఏర్పాటు చేయడంతో భూముల రేట్లు ఆకాశానంటేయ్యి. దీంతో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ కబ్జా చేసేందుకు రాజకీయ నాయకుల అండదండలతో కబ్జాలోకి దిగుతున్నారు. ఎండలకు హిమాయత్ సాగర్ జలాలు అడుగంటి పోవడంతో కబ్జా రాయలు దాన్ని ఆసరాగా తీసుకొని మట్టి పోస్తూ ప్రీ కాస్ట్ నిర్మిస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్న జలమండలి రెవెన్యూ అధికారులు అటుపక్క తొంగీ చూడడం లేదని స్థానికులు వాపోయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం హైదరాబాద్ జంట జలాశయాలపై దృష్టి సారించి హిమాయత్ సాగర్ చెరువును కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





# అండర్పాస్‌లో నిలిచిన మోకాళ్ల లోతు వరద నీరు...

**నిలిచిన పాదాచారుల రాకపోకలు....**

**రాజేంద్రనగర్ మహా ;** నిన్న కురిసిన కుండపోత వర్షానికి శంషాబాద్ సర్కిల్ పరిధిలోని తొండుపల్లి రైల్వే అండర్ పాస్ మడుగును తలపిస్తుంది. ఇతర గ్రామాలకు రవాణా సౌకర్యార్థం రైల్వే శాఖ అండర్పాస్‌ను నిర్మించింది. మంగళవారం కురిసిన వర్షానికి మోకాళ్ళ లోతు వరద నీరు వచ్చి చేరింది. దీంతో అండర్ పాస్ అటువైపు ఇటువైపు వాహనదారులు పాదాచారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు పాదచారులు రైల్వే అధికారులకు మొరపెట్టుకున్నా.లాభం లేదని స్థానికులు వాపోయారు. దీనిపై జిహెచ్ఎంసి అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.



# ప్రభాస్ కొత్త కాంబోపై క్లారిటీ

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ప్రముఖ దర్శకుడు ఆదిత్య ధర్ కలిసి సినిమా చేయబోతున్నారనే వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ వార్తలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించినప్పటికీ, ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌పై ఎలాంటి అధికారిక స్పష్టత లేదని సినీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రభాస్, ఆదిత్య ధర్ ఇటీవల భేటీ అయిన విషయం నిజమేనని తెలుస్తోంది. ఇద్దరి మధ్య కొన్ని ఆలోచనలు, సినీ అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. అయితే ఆ సమావేశం కొత్త సినిమా కోసం జరిగిందనే విషయాన్ని ఎవరూ ధృవీకరించలేదు. ప్రస్తుతం ఈ కాంబినేషన్‌పై అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం.ఇదిలా ఉండగా, ప్రభాస్ ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో తెరకెక్కుతున్న 'స్పిరిట్' చిత్ర పనులు కొనసాగుతున్నాయి. అలాగే 'ఫౌజీ' చిత్రంతో పాటు 'కల్కి 2' ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా ముందుకు సాగుతున్నాయి. వీటి తర్వాత 'సలార్ 2' కూడా షెడ్యూల్‌లో ఉండటంతో, కొత్త ప్రాజెక్ట్‌లకు సమయం కేటాయించడం ప్రస్తుతం కష్టసాధ్యంగా కనిపిస్తోంది.

మరోవైపు ఆదిత్య ధర్ కూడా తన తదుపరి చిత్రాల ప్రణాళికలతో బిజీగా ఉన్నారు. కొన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలతో ఆయన ఇప్పటికే చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన ఆయన ప్రాజెక్ట్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో, కొత్త కథల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు సమాచారం.



ఈ పరిస్థితుల్లో ప్రభాస్ - ఆదిత్య ధర్ కాంబినేషన్‌పై వస్తున్న వార్తలు ప్రస్తుతం ఊహాగానాలుగానే కనిపిస్తున్నాయి. అయితే భవిష్యత్తులో వీరిద్దరూ కలిసి పనిచేసే అవకాశం పూర్తిగా కొట్టిపారేయలేమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం మాత్రం ఈ కాంబోపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు

# బన్నీకి పెద్ది రిప్లై

అల్లు అర్జున్ పెద్ది రివ్యూకు రామ్ చరణ్ స్పందించారు. మీరు మాకు శుభాకాంక్షలు చెప్పడం మాకు టీమ్‌కు చాలా ప్రత్యేకమన్నారు. మీ సినిమా రాకా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని రామ్ చరణ్ ట్వీట్ చేశారు. మీరు మాపై చూపిన ప్రేమకు ధన్యవాదాలు అంటూ రాసుకొచ్చారు. ఇది చూసిన మెగా ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇటీవల పెద్ది వీక్షించిన అల్లు అర్జున్ సినిమాపై తన రివ్యూ ఇచ్చాడు. నిన్న రాత్రి సినిమా చూసిన ఆయన ఈ రోజు ట్విటర్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. రామ్ చరణ్ నటన మైండ్ బ్లోయింగ్. ఆయన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, నటన,అదిరిపోయే స్టెప్పులతో అలరించాడని అన్నారు. నా బ్రదర్‌ని చూసి నిజంగా ఎంతో గర్వంగా ఫీలవుతున్నా. ఈ ప్రశంసలన్నింటికి చరణ్ నిజమైన అర్హుడని ప్రశంసించారు. జాన్వీ కపూర్, జగపతి బాబుతో పాటు ఇతర నటీనటులు చాలా బాగా నటించారు. చరణ్‌ను అత్యున్నత స్థాయిలో కూర్చోబెట్టేలా చేసిన దర్శకుడు బుచ్చిబాబుకి ప్రత్యేక అభినందనలు అంటూ పోస్ట్ చేశారు. ఇక పెద్ది సినిమా విషయానికొస్తే.. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.





# పెద్ది వివాదంపై ఆదా శర్మ స్పందన

రామ్ చరణ్ నటించిన పెద్ది సినిమాకు సంబంధించిన వివాదం ఇంకా చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. ముఖ్యంగా జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలువురు ప్రముఖులు స్పందించగా, తాజాగా నటి ఆదా శర్మ కూడా తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆదా శర్మను పెద్ది వివాదం గురించి ప్రశ్నించగా, తాను ఇప్పటివరకు ఆ సినిమా చూడలేదని చెప్పింది. సినిమా చూడకుండా దాని గురించి వ్యాఖ్యానించడం సరికాదని పేర్కొన్న ఆమె, సాధారణంగా పాత్రల ఎంపిక విషయంలో నటీనటులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

పాత్రలను ఎంచుకునే సమయంలో వాటి ప్రభావం, కథలో వాటి ప్రాధాన్యం వంటి అంశాలను పరిశీలించడం అవసరమని ఆదా అభిప్రాయపడింది. అయితే ఈ బాధ్యత కేవలం హీరోయిన్లకే పరిమితం కాదని, నటులు, దర్శకులు, నిర్మాతలు కూడా సమానంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొంది.

ఒక్క నిర్ణయం కూడా ప్రేక్షకుల్లో పెద్ద చర్చకు దారితీయవచ్చని, అందుకే సినిమాల రూపకల్పనలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆమె చెప్పింది. ప్రస్తుతం సినీ పరిశ్రమలో మహిళా పాత్రల ప్రాధాన్యంపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఆదా శర్మ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

ఇదిలా ఉండగా, బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన పెద్ది చిత్రం గ్రామీణ క్రీడల నేపథ్యంతో రూపొందింది. విడుదల తర్వాత జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో, చిత్ర బృందం వాటిని తొలగించినట్లు ప్రకటించింది. దర్శకుడు కూడా ఈ అంశంపై స్పందిస్తూ ప్రేక్షకుల మనోభావాలను గౌరవిస్తున్నామని వెల్లడించారు.

అయినప్పటికీ ఈ అంశంపై చర్చలు కొనసాగుతుండగా, సినీ ప్రముఖుల స్పందనలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.



# చ్చని చీరలో మెరిసిన నువేక్ష

తాజాగా విడుదలైన ఓ అందమైన ఫొటోలో నటి నువేక్ష సంప్రదాయ అందాలను, ఆధునిక శైలిని అద్భుతంగా మేళవిస్తూ ఆకట్టుకుంది. ఎమరాల్డ్ గ్రీన్ రంగు చీరకు బ్లాక్ ఎంబ్రాయిడరీ బ్లౌజ్‌ను జతచేసుకుని ఎంతో హుందాగా కనిపించింది. గ్రామీణ వాతావరణాన్ని తలపించే నేపథ్యంలో ఆమె ఇచ్చిన సున్నితమైన చిరునవ్వు, సహజమైన హావభావాలు అభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.1999 ఆగస్టు 1న కర్ణాటకలోని బెంగళూరులో జన్మించిన నువేక్ష తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి. 2021లో విడుదలైన ఇప్పుడు కాక ఇంకెప్పుడు చిత్రంతో సినీ రంగంలో అడుగుపెట్టిన ఆమె, తొలి సినిమాతోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అనంతరం అతిథి దేవోభవ (2022), సెబాస్టియన్ పీసీ 524 (2022) వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది.

అయితే విశ్వక్ సేన్ హీరోగా తెరకెక్కిన సస్పెన్స్ థ్రిల్లర్ హిట్: ది ఫస్ట్ కేస్ చిత్రంలో 'సప్నా' పాత్ర ద్వారా నువేక్షకు మరింత గుర్తింపు లభించింది. ఆ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తన పాత్రకు న్యాయం చేస్తూ భావోద్వేగ సన్నివేశాల్లోనూ, కథకు అవసరమైన చోట సహజమైన నటనతోనూ ఆకట్టుకుంది.ఇటీవల రోటీ కపడా రొమాన్స్ (2024) చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నువేక్ష, కథానాయికగా తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. గ్లామర్ పాత్రలతో పాటు కథా ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా ఎంపిక చేసుకుంటూ తన ప్రతిభను చాటుకుంటోంది. ప్రతి సినిమాతో నటిగా మరింత పరిణతి సాధిస్తూ, టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకునే దిశగా అడుగులు వేస్తోంది.అందం, అభినయం, తెరపై ఆకట్టుకునే వ్యక్తిత్వం కలిగిన నువేక్షకు యువతలో మంచి అభిమాన వర్గం ఏర్పడుతోంది. విభిన్నమైన పాత్రలను పోషించాలనే తపన, కష్టపడే తత్వం ఆమెను భవిష్యత్తులో తెలుగు సినీ పరిశ్రమలో ప్రముఖ నటీమణుల సరసన నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆమె చేతిలో మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో నువేక్ష కెరీర్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com